హైదరాబాద్ వార్త

# పనులు చేసి ఫలితమేంటి?



- అకాల వర్షాలతో బయటపడుతున్న వైఫల్యాలు
- నాలాల్లో చెత్తా చెదారం, మట్టి కుప్పలు
- తొలగించిన వ్యర్థాలు సైతం తిరిగి నాలాల్లోకే
- నామమాత్రంగానే పూడికతీత పనులు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

గ్రేటర్ నాలాల పూడికతీత పనులు 80శాతానికి పూగా పూర్తయ్యాయని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు పలు ప్రాంతాలలో నాలాలు పొంగిపోయి కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వరదనీరు పొంగిపోగా, కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వరదనీరు చేరగా, ఇంకొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై ప్రవహించింది. కొన్ని నాలాల్లో చెత్తా చెదారం, మట్టి కుప్పలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. దీంతో పూడికతీతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వ్యర్థాలు తొలగించారా..? కాగితాల్లో కాకి లెక్కలతో సరి పెడుతున్నారా..? అన్నది తేల్సాల్సి ఉంది. కాలనీ, బస్తీ, మేజర్, మైనర్ నాలా అనే తేడా లేకుండా చాలా ప్రాంతాల్లో వ్యర్థాలు మేట వేశాయి. ప్రవాహ వ్యవస్థ సాఫీగా లేక నాలాలు పొంగి పక్కనున్న ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. ఇది స్థానికులతో పాటు వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారుతోంది.

**ఎక్కడ చూసినా వ్యర్థాలే..**

వర్షాకాలంలోపు మొత్తం వ్యర్థాలను తొలగించాలి. అనంతరం వరదతో పాటు వచ్చే చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు ఎప్పటికప్పుడు తీయాలి. ఇప్పటికే అకాల వర్షాలు మొదలయ్యాయి. ఈసారి వానలు విస్తారంగా కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చెబుతోంది. అయినా నాలాల పూడికతీత పనులు పూర్తికావడంలేదు. దీంతో మరోసారి నగరానికి ముంపు ముప్పు తప్పేలాలేదు. తొలగించిన వ్యర్థాలను నాలాలపక్కనే వేస్తుండడంతో వర్షాలకు తిరిగి నాలాల్లో చేరుతున్నాయి. దీంతో పనులు చేసినా ప్రయోజనం లేకుండాపోతోంది. వర్షానికి దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, మరమ్మత్తు, నాలాల పూడికతీత, ఇతరత్రా పనులు ముందుగా సాగే అవకాశం కనిపించడం లేదు.

**నాలా కొన్ని ప్రాంతాల్లో ఇలా..**

నల్లకుంట పద్మాకాలనీ నుంచి పాత రామాలయం, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా మీదుగా హుస్సేన్ సాగర్ నాలాలో తిలక్‌నగర్ రైల్వే బ్రిడ్జీ వద్ద కలుస్తుంది. శివం రోడ్ ఎన్‌సీసీ నుంచి న్యూనల్లకుంట, తిలక్‌నగర్ సీగల్‌కేఫ్, ఛేనెంబర్ చౌరస్తా, శంకర్‌నగర్, డీమార్ట్ పక్క నుంచి మూసీ నదిలో కలిసే నాలాలోనూ వ్యర్థాలు నిండి ఉంటున్నాయి. బాగ్‌లింగంపల్లి బ్రిడ్జి వద్ద నుంచి గాంధీనగర్, రత్నానగర్, ఖార్ఖానా, నెహ్రూ నగర్, శాస్త్రీ నగర్ నుంచి మూసీలో కలిసే హుస్సేన్ సర్‌ప్లస్ నాలాలోనూ పనులు పూర్తికాలేదు. బాగ్ అంబర్‌పేట డివిజన్ మోహిన్‌చెరువు నుంచి అంబర్‌పేట డివిజన్ బాపునగర్, చెన్నారెడ్డినగర్, న్యూ పటేల్ నగర్, పటేల్‌నగర్, ప్రేమ్ నగర్‌ల మీదుగా మూసీలో కలిసే వరకు ఉన్న ఈ నాలాలో పూడికతీత పనులు నామమాత్రంగా కొనసాగాయి. గుడిమల్కాపూర్ నుంచి మొఘల్ కా నాలా వరకు, రేతిబౌలి నుంచి గుడిమల్కాపూర్ వరకు, రేతిబౌలి నుంచి గుడిమల్కాపూర్ వరకు, టోలిచౌకి నుంచి శాతం చెరువు వరకు నాలాల్లో వ్యర్థాలు తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. హాఫీజ్‌పేట, ప్రేంనగర్, ఆదిత్యనగర్, గోపినగర్, మియాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో నాలాల్లో చెత్త మట్టితో దర్శనమిస్తున్నాయి. చంపాపేట డివిజన్‌లోని పలు కాలనీల్లో పూడికతీత పనులు ఇంకా జరగలేదు. వర్షాలు మొదలైన దృష్ట్యా వెంటనే వ్యర్థాల తొలగింపు ప్రారంభించాలి. ఇటీవల వానలకు నాలాలు పొంగిపొర్లి స్థానికంగా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. వరదనీరు సాఫీగా వెళ్లేలా వెంటనే చర్యలు తీసుకోవాలి. దుర్గాభవానీ నగర్, చంపాపేట రెడ్డి కాలనీలోనని నాలా పూడికతీత పనులు ఇప్పటికీ జరగలేదు. గతేడాది కూడా వర్షాలు మొదలయ్యాక తూతూమంత్రంగా వ్యర్థాలు తొలగించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే డివిజన్‌లోని మారుతీనగర్, దుర్గా భవానీనగర్, ఎస్‌జీఆర్ కాలనీల్లోనూ పూడిక తీయకపోవడంతో ఇటీవల వర్షాలకు వరద నీరు రోడ్లపైకి చేరింది. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని నాలాలు పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి.

# కూకట్‌పల్లిలో గుంతల మయంగా రోడ్లు

## రూ. కోట్లు వెచ్చిస్తున్నా మారని రోడ్లు..



వివేకానంద నగర్ కాలనీలో వర్షానికి కొట్టుకుపోయిన రోడ్లు



హైదర్‌నగర్ రిషి కాలేజీ ముందట రోడ్డు



కూకట్‌పల్లి బురుజు వద్ద రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యం

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రోడ్ల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. అధ్వాన్నపు రోడ్లతో నిత్యం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కోట్లు వెచ్చిస్తున్న రోడ్ల పరిస్థితి నిర్వహణ ఏమాత్రం కనిపించడం లేదు. కూకట్పల్లి జోన్ పరిధిలోనే కెపిహెచ్బి కాలనీ, కూకట్పల్లి, వివేకానంద నగర్, బాలాజీ నగర్ మూసాపేట్, బాలానగర్, ఆల్విన్ కాలనీ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు మరింత గతుకుల మయంగా మారాయి. సంవత్సరాల తరబడి ఏ రోడ్డు చూసిన అదే పరిస్థితి కనిపిస్తుంది. ఏ రోడ్డు చూసినా బాగుందన్న పరిస్థితి కనిపించడం లేదు. ఏటా కోట్ల రూపాయలను రోడ్ల నిర్వహణ కోసం కేటాయి స్తున్నారు కానీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు మొదలుకొని జోనల్ కమిషనర్, ఎస్ఈలు సమావేశాలు నిర్వహించిన రోడ్ల సమస్యలు మాత్రం యధాతదంగా ఉన్నాయి. గుంతల మయపు రోడ్లతో ప్రజలు నిత్యం పడరాని పాట్లు పడుతున్నా రు. ఇటీవల కురిసిన వర్షాలతో ఇదివరకే అధ్వానం గా ఉన్న రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారాయి. భారీ వర్షాల కారణంగా చాలాచోట్ల రోడ్లపై మరిన్ని గుంతలు ఏర్పడ్డాయి. ఇలాంటి అధ్వాన్నపు గుంతల మయమైన రోడ్లవైపు ఇంజనీరింగ్ విభాగం అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలు కురిశాయంటే ఏ రోడ్లు చూసిన గుంతలలో వర్షపు నీటితో నిండి ఉండడంతో ముందుకు సాగలేని పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపైనే ఎక్కడికక్కడ నిలిచిన నీరు, తెరిచి ఉన్న మ్యాన్ హోల్స్‌తో వాహనదారులతోపాటు పాదాచారులను భయబ్రాంతుల కు గురి అవుతున్నారు. రహదారులపై వర్షపు నీరు ఒకవైపు, మరోవైపు రోడ్లన్నీ గతకులు తేలి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# పార్క్ స్థలం శివబాగ్ కాలనీకే చెందుతుంది : ఎమ్మెల్యే తలసాని



వివిధ అధికారులతో బేటీ అయినా శివబాగ్ కాలనీ ప్రతినిధులతో ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** పార్క్ స్థలం శివబాగ్ కాలనీకే చెందుతుందని, మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. తమ కాలనీలోని పార్కు స్థలాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కాలనీ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి శివబాగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీకి చెందిన పార్కు స్థలాన్ని ఎట్టి పరిస్థితులలో వదిలేది లేదని అవసరమైతే కాలనీ వాసులతో ఆందోళన చేపట్టడానికి సిద్ధాంగా ఉన్నామన్నారు. కాలనీ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఆలోచతో పార్కును పచ్చదనంతో అభివృద్ధి చేయడం జరిగిందని, ఓపెన్ జిమ్‌ను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాలనీలో అనేక అభివృద్ధి పనులు కూడా మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ స్థలాన్ని అక్రమించాలనే దురుద్దేశంతో కొందరు ప్రయత్నిస్తున్నారని అధికారులు దానిని అడ్డుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో 2011లోనే న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన పత్రాలను కాలనీ వాసులు ఎమ్మెల్యే, అధికారులకు అందజేశారు. ఈ విషయంలో జిహెచ్ఎంసి అధికారులు, స్టాండింగ్ కమిటీ చొరవ చూపాలన్నారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డీసీ జయంత్, బి.ఈ. వాసుదేవరెడ్డి, వాటర్స్ వర్క్స్ జిఎం ప్రభాకర్, హార్టికల్చర్ అధికారి జ్యోత్స్న, అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు హన్మంతరావ్, కాలనీ ప్రతినిధులు రాజు, సంజీవరావ్, జట్నాని, రామ్‌నివాస్, బన్సాల్, సుబ్బయ్య, అనీల్ చౌదరి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యే అభివృద్ధికి సోపానం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



అంబర్‌పేట ప్రభుత్వ స్కూల్లో పుస్తకాలు పంపిణీచేసి, విద్యార్థులతో కరచాళనం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ గౌతంరావు తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** విద్యే అభివృద్ధికి సోపానమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం అంబర్‌పేట సిపిఎల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమాజంలో మనకు గుర్తింపు తెస్తుంది ఒక స్థానాన్ని కల్పిస్తుంది మనం ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యా ఉపయోగపడుతుందన్నారు. ఎంతో కష్టపడి మీ తల్లిదండ్రులు మీ పై ఎన్నో ఆశలు పెట్టుకొని మిమ్మల్ని చదివిస్తున్నారు వారి ఆశాల్ని నిలబెట్టాలన్నారు. ప్రభుత్వం స్కూల్ లో చదువుతున్నమని చిన్న చూపుగా భావించవద్దని, ప్రైవేట్ స్కూళ్ళకు దిటుగా ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో విద్య కొనసాగుతుందన్నారు. ఎందుకంటే ఇక్కడ ఉన్నతమైన విద్యావంతులు, మంచి శిక్షణ పొందిన టీచర్లు ఉంటారు వారు మీకు ప్రైవేట్ పాఠశాలకు దిటుగా విద్యను బోధిస్తారన్నారు. అనేకమంది గొప్ప వాళ్ళు దేశానికి సేవా చేసిన వాళ్ళు నేడు దేశానికి సేవలందిస్తున్న వాళ్ళు ఎంతో మంది శాస్త్ర వేత్తలు గొప్పగొప్ప మేధావులంతా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారేఅని గుర్తుచేశారు. మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం, అటల్ బిహారీ వాజ్పేయి లాంటి వారు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఉన్నతంగా ఎదగాలంటే అత్యధిక మార్కులు సాధించడ అన్నిరంగాల్లో నైపుణ్యత సాధించాలని, అమ్మాయిలకు అన్నిరంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి, అమ్మాయిలు బాగా చదివి ఉన్నంతంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు డాక్టర్ గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం ఆదేశాలతో కదిలిన రెవెన్యూ, పోలీసు యంత్రాంగం

## - తుక్కుగూడలో ప్రభుత్వ భూమి స్వాధీనం





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్. ఆగస్టు 23 ప్రబాతవార్త :** తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ, సీలింగ్, లావాణి భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడానికి భారీ పోలీసుల బందోబస్తు మధ్యన రంగంలోకి దిగారు. శనివారం జిల్లా పరిధిలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంకల్ రెవెన్యూ పరిధిలోని భారీగా నిర్మాణంలో ఉన్న వర్టెక్స్ వర్మ కంపెనీ ఆదీనంలో 20 ఎకరాల ప్రభుత్వ భూములను పోలీసుల బందోబస్తు మధ్యన సర్వే చేసి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. మహేశ్వరం ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్, హెచ్ఎండీఏ అదికారులు సమన్వయంతో రంగంలోకి దిగి ఇట్టి భూములపై సమగ్ర సర్వే చేసి ఆదీనంలోకి తీసుకుంటున్నారు. అయితే గత 1982లో నాడు తుక్కుగూడ గ్రామానికి చెందిన ఆరుమంది ఎస్సీలు(మాల). ముగ్గురు బీసీలు(గౌడ్), ఒకరు ముస్లీం, ఒకరు కరుణం 11 మందికి 24ఎకరాల 31 గుంటను ఆనాడు సీలింగ్ పట్టాను పంపిణీ చేయడం జరిగింది. సర్వేనెంబర్ 70,71,73,85, 6,194లో ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున ఆనాడు పట్టాలిచ్చి పంపిణీ చేయడం జరిగింది. ఈ భూములు వర్టెక్స్ వర్మ కంపెనీ పేరుతో ఉన్న వ్యక్తులకు గతంలో 2018లో క్రయవిక్రయాలు (అమ్మకాలు) చేశారనే ఆరోపణలతో గత కొంతకాలంగా ఈ భూములపై సోషల్ మీడియా, కొన్ని దిన పత్రికల్లో ఆరోపణలు, విమర్శలు రావడంతో ఆ కంపెనీ ఈ రైతులకు తిరిగి భూములు అప్పగించినట్లు చెబుతున్నప్పటికి ఈ భూములపై కొత్త వివాదం నెలకొంది. ఈ 24ఎకరాల భూముల్లో కొత్తగా కొంత మంది రాజకీయ నాయకులు తమకు భూ రికార్డులున్నాయని ఆ భూములపైకి వెళ్లడం, ఫ్రీకాస్టులు వేసుకోవడంతో ఈ భూములపై కొత్త వివాదానికి దారితీసింది. ఈ భూములు మావంటూ రైతులు, మరోపక్క కొంతమంది రాజకీయ నాయకులు మావే అంటూ తమకు రికార్డులున్నాయని ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటు ఉండడం, వర్టెక్స్ వర్మ కంపెనీ యాజమాన్యం మాత్రం తమ ఆదీనంలో ప్రభుత్వ భూములు లేవంటుండగా విమర్శలు జరుగుతుండగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కోట్లాది రూపాయలు చేసే ఈ భూములపై గత 20 రోజుల క్రితం సోషల్‌మీడియా, ఇతర దిన పత్రికల్లో కథనాలు రావడంతో స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయం నుండి నేరుగా జిల్లా కలెక్టర్, ఆర్డీవోకు ఆదేశాలిస్తూ ఈ భూములను తక్షణమే ఆదీనంలోకి తీసుకోవాలని ఆదేశించడంతో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం శనివారం రంగంలోకి దిగడం, పోలీసులు, రెవెన్యూ అధికారులకు, రాజకీయ నాయకులకు మాటమాట పెరగడంతో ఘర్షణ వాతావరణానికి దారితీసింది. ఇది ఇలా ఉండగా ఈ భూములపై గత బీఆర్ఎస్ హయాంలోనే స్థానిక మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి వివాదస్పదంగా మారుతున్న ఈ సీలింగ్ భూములను తక్షణమే స్వాదీనం చేసుకోవాలని తన సిబ్బందితో స్థానిక ఆర్డీవో, డీసీపీ, విజిలన్స్, హెచ్ఎండీఏ, హైడ్రా అధికారులకు ఫిర్యాదులు చేసిన దృవపత్రాలను సైతం బహిర్గతం చేశారు. అయితే కేఎల్ఆర్ పిర్యాదులపై నాటి ప్రభుత్వంలోని అధికారులు గాని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేస్తున్న అదికారులు కూడా ఈ భూములపై సమగ్ర విచారణ చేయడం కానీ, స్వాదీనం చేసుకోకపోవడంతో రెండు, మూడు సంవత్సరాలుగా ఈ భూములు వివాదస్పదంగా మారడం, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో కథనాలు రావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయాన అదికారులను ఆదేశించినట్లు సమాచారం.

## బిసి రిజర్వేషన్ల అమలుకై పార్లమెంట్‌లో చట్టం చేయాలి

### విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న ఐఏఎస్ చిరంజీవులు

**ధర్నాచౌక్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42శాతం రిజర్వేషన్ల అమలుకై పార్లమెంట్‌లో చట్టం చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు డిమాండ్ చేశారు. శనివారం బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై చిరంజీవులు మాట్లాడుతూ తమిళనాడు తరహాలో రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్ లో చేర్చి, బీసీ రిజర్వేషన్‌లు అమలుచేయాలని కోరారు. బిఎల్ఎఫ్ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు ఎస్సీ ఎస్టీలతో కలసి బీసీలు ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వని రాజకీయ పార్టీలను రాజకీయంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. నాయకులు గాదగోని రవి మాట్లాడుతూ రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. విద్య ఉద్యోగ, రాజకీయ రంగాలలోనే కాకుండా భూమిలో సైతం సమాన వాటా పంపిణీ జరగాలని డిమాండ్ చేశారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కే.పర్వతాలు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో ప్రజాపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నూనె వెంకటస్వామి, బీఎల్ఎఫ్ నేతలు ఎస్.సిద్ధిరాములు, సబ్బని లత, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, కే.గోపాల్, వడ్ల సాయికృష్ణ, మాస్ సావిత్రి, బి.సి. ఉద్యమ నాయకులు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

## పొంగుతున్న మురుగు...దుర్వాసనతో అవస్థలు



పోలీసు స్టేషన్ పక్కనే పొంగి పొర్లుతున్న మురుగునీరు

**బేగంపేట ఆగస్టు 23, ప్రభాతవార్త :** బేగంపేట పోలీసుస్టేషన్ పక్కనే డ్రైనేజీల నుంచి పొంగుతున్న మురుగునీరు వీధులన్నింటినీ తీవ్ర దుర్గంధ భరితంగా మార్చింది. బేగంపేట పోలీసు స్టేషన్ పక్క నున్న క్వార్టర్స్ లో డ్రైనేజీలు పొంగి పొర్లుతూ సమీపంలో పెద్ద ఎత్తున నిల్చిపోయింది. ఇదే ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ముందు ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్ నుంచి కూడా పెద్ద ఎత్తున మురుగు నీరు బయటకు వచ్చి అక్కడ పల్లంగా ఉండటంతో అక్కడే నిల్చిపోయింది. దీంతో ఈ నీటి నుంచి వచ్చే వాసనతో ఆ మార్గంలో వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రోడ్డుపై నిల్చిన నీటిలో వాహనాలు ప్రయాణించిన సమయంలో ఆ నీరు రోడ్డు వెంట వెళుతున్న పాదచారులపై పడటంతో తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. ఈ ప్రాంతం కంటోన్మెంట్ పరి ధిలో ఉండటంతో కంటోన్మెంట్ అధికారులు వెంటనే పోలీసులైన్‌లో పొంగి పొర్లుతున్న డ్రైనేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలోనే బేగంపేట ఏసీపీ కార్యాలయం, నార్త్‌జోన్ ఎస్‌బీ ఏసీపీ కార్యాలయం ,బేగంపే టలా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్, ఇతర రాష్ట్రాలకు చెం దిన పోలీసు ఉన్నతాధికారులు సైతం నివసిస్తుంటారు. ఇప్పటికైనా కంటో న్మెంట్ బోర్డు అధికారులు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పర్యావరణ హితంగా గణేశ్ చతుర్థి జరుపుకోవాలి

### - మేయర్ గద్వాల్ విజయలక్ష్మి




సిబ్బందికి మట్టిగణేష్ విగ్రహాలను అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** పర్యావరణ హితంగా, ఘనంగా గణేష్ చతుర్థిని జరుపుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర ప్రజలను కోరారు. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు, సిబ్బందికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తో కలిసి మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... గణేష్ చతుర్థి పది రోజుల పాటు జరిగే ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ పండుగను పర్యావరణ పరిరక్షణకు మద్దతుగా జరుపుకోవడమే జీహెచ్ఎంసీ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలియజేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శానిటేషన్, వీధి లైట్లు, చెట్ల కొమ్మల తొలగింపు, రోడ్డు మరమ్మత్తులు, నిమజ్జన ఏర్పాట్లలో క్రేన్లు, కంట్రోల్ రూములు, బేబీ పాండ్ లు, ఎక్స వేటరీ పాండ్ లు, తాత్కాలిక పాండ్ల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శోభాయాత్రల సందర్భంగా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి తీసుకుంటామని తెలిపారు. 25 వేల మంది కార్మికులు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహించనున్నా రని మేయర్ తెలిపారు. పర్యావరణానికి హానికరమైన పి.ఓ.పి విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించుకోవాలి ఆమె కోరారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా 2 లక్షల మట్టి వినాయక విగ్రహాలను క్షేత్రస్థా యిలో పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పని చేస్తున్నాయని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులపై దాడి.

**మెహిదీపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త :** బైక్ పై వెళ్తున్న ఇద్దరు యువకులపై దాడికి పాల్పడ్డ ఘటన ఆసిఫ్ నగర పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రామాంజనేయులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మెహిదిపట్నం లోని ఎంపీ గార్డెన్ సమీపం వెనుక నుంచి వేగంగా వస్తున్న స్కార్పియో పోలీసు సైరన్ చేసుకుంటూ యువకులను ఢీకొన్నది. ఈ క్రమంలో బైక్ పై ఉన్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలంలోనే ఇరు వర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. ఈ సంఘటనలో స్కార్పియో లో వచ్చిన ముగ్గురు వ్యక్తులు కత్తులు, గన్ తీసి ఇద్దరు యువకులపై దాడి చేసేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు శాంతించి అక్కడ నుంచి నెమ్మ దిగా పారిపోయారు. కాగా గాయపడిన ఇద్దరి యువకుల బంధువులు ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కి లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులను ప్రశ్నించగా కత్తులు లేనట్లు మేము సీసీ కెమెరాలు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. కాగా స్కార్పియో లో వచ్చిన ముగ్గురు వ్యక్తులు కార్వాన్ ప్రాంతానికి చెందిన అర్బాన్, సోహేల్, సిద్దార్థ్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆరోగ్యమిత్రలకు త్వరలోనే డిఈఓ కేడర్

**-రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు**



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తును కలిసిన ఆరోగ్యమిత్రలు

**చిక్కడపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు త్వరలోనే డిఈఓ కేడర్‌ను కల్పించడానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు హామీ ఇచ్చారు. శనివారం ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి. యాదయ్య నేతృత్వంలో ప్రతినిధి బృందం చోంగ్తును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా క్యాడర్, ఇతర సమస్యల అన్నింటిని క్లుప్తంగా వివరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లో స్కిల్స్ ఎంప్లాయిస్ ఉన్నారని, ఇప్పటివరకు అన్యాయం జరిగింది వాస్తవం అని, ఈ విషయంలో త్వరలోనే ఆర్థిక శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి త్వరలోనే త్వరలోనే డి ఈ ఓ కేడర్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు సుమన్, హైదరాబాద్ అధ్యక్షులు రాజు, హనుమకొండ అధ్యక్షులు రవీందర్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగరాజ్, ఖమ్మం జిల్లా సభ్యులు కిషోర్, పెద్దపెల్లి జిల్లా నుండి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్టీ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



డ్రంక్ డ్రైవ్‌లో భాగంగా తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, అదనపు డీసీపీ రాములు, ఏసీపీ మోహన్‌కుమార్, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** వీఎస్టీ రాంనగర్ అజామాబాద్ వెళ్లేదారిలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ క్రాస్‌రోడ్స్ వద్ద శనివారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం నేతృత్వంలో జరిగిన ఈ డ్రైవ్ కార్యక్రమంలో ప్రత్యేకంగా సెంట్రల్ ఈస్టర్న్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసరావు, అడిషనల్ డీసీపీ రాములు, సెంట్రల్ జోన్ ఏసీపీ మోహన్‌కుమార్‌లు పాల్గొని తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. నగర సీపీ, జాయింట్ సీపీల ఆదేశాల మేరకు ఎప్పుడైనా ఎక్కడైనా డ్రంకెన్ డ్రైవ్ 24x7లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు.

### విగ్రహాలను తెచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

**గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి**



చెట్టుకొమ్మల మధ్య ఇరుక్కున్న గణపతి విగ్రహాన్ని తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

**ముషీరాబాద్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** వినాయకచవితి పండుగ సందర్భంగా విగ్రహాలను మండపాలకు తెచ్చే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి సూచించారు. శనివారం ట్యాంక్‌బండ్ వద్ద గణపతి విగ్రహం చెట్టు కొమ్మల మధ్య ఇరుక్కుపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ట్రాఫిక్ పోలీసులు దగ్గర ఉండి, విగ్రహాన్ని జాగ్రత్తగా తరలించేందుకు సహకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విగ్రహాలు తీసుకువచ్చే ముందు రోడ్లపై పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలని, ఎంత ఎత్తు వరకు ఆ రోడ్లలో సురక్షితంగా తీసుకురాగలమో, లేదో ముందే చూసుకుని తీసుకురావాలని సూచించారు. విగ్రహాలు అత్యంత భారీ ఎత్తు ఉండటం వల్ల మెట్రో బ్రిడ్జ్, స్టీల్ బ్రిడ్జ్, చెట్లు, కరెంట్ వైర్లు వంటివి అడ్డు వచ్చి విగ్రహాలను రోడ్డు మధ్యలో ఆపేయవలసిన పరిస్థితి ఏర్పడుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తోందని అన్నారు.

### అమిత్‌షా కేరళలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

**తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి**

**ముషీరాబాద్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇండియా కూటమి నుంచి ఉప రాష్ట్రపతిగా నిలబెట్టిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై కేరళలో చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజకీయ లబ్ధి కోసం విజ్ఞతా రహితంగా సుదర్శన్‌రెడ్డిని ఉద్దేసించి ఆయన నక్సల్ అనుకూలుడు, నక్సలిజానికి మద్దతుదారు అంటూ వ్యాఖ్యలు చేయటం తెలంగాణ న్యాయవాదులుగా ఖండిస్తున్నామన్నారు. కోర్టు తీర్పును, తీర్పునిచ్చిన న్యాయమూర్తిని వ్యక్తిగతంగా నిందించటం, ఆరోపణలు చేయటం కోర్టు ధిక్కారం కిందకే వస్తుందనే కనీస విజ్ఞతి లేకుండా కేంద్ర మంత్రి స్థాయిలో ఉండి మాట్లాడటం విచారకరమన్నారు. తక్షణమే అమిత్‌షా వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షం న్యాయవ్యవస్థను, న్యాయమూర్తులను అవమానించినట్లే అవుతుందని అన్నారు.

### సమావేశానికి హాజరుకావల్సిందిగా కేంద్రమంత్రికి ఆహ్వానం



కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందచేస్తున్న గణేష్ మండప నిర్వాహకులు

**హైదరాబాద్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో గణేష్ మండప నిర్వాహకుల సమావేశంకు హాజరుకావల్సిందిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను సమితి నాయకులు అందచేశారు. శనివారం సాయంత్రం ఆరు గంటలకు అశోక్ ఫంక్షన్‌హాల్, గోల్నాకలో నిర్వహించే గణేష్ మండప నిర్వాహకుల సమావేశంకు కేంద్రమంత్రితో పాటు అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాచిగూడ కార్పోరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌లను కలసి ఆహ్వాన పత్రిక అందచేసినట్లు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట్ నియోజకవర్గ కన్వీనర్ అచ్చిని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు పి.గోవర్ధన్‌రెడ్డి, ఎస్.వెంకటస్వామిగౌడ్, ఎస్.నర్సింగ్‌రావు, వెంకటేష్‌దయాళ్, మైలారామ్, రాజు మరియు సమితి సభ్యులు పాల్గొన్నారు.

## మనిషికి సృజనాత్మకతనుపెంచే సందేశాత్మక నవల బంగారుతీగ : డా. కె.వి.రమణాచారి



బంగారుతీగ నవలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, పూర్ణచందర్‌రావు, జయరాములు, శోభాపేరిందేవి తదితర అతిథులు

**నాంపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** దేశంలో నానాటికీ పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వ్యాపారం, వినియోగం, ముఖ్యంగా యువత బానిసై జీవిత వినాశనం, ఎన్నో అవాంఛనీయ సంఘటనలకు దారితీస్తున్న విషయం నిత్యం జరుగుతున్న తరుణంలో వీటినుండి కాపాడడంలో మనుషులకు అవగాహన కల్పించి సృజనాత్మకతను పెంచే సందేశాత్మకం ఈ బంగారుతీగ నవల అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి. రమణాచారి అన్నారు. ఈ మాదకద్రవ్యాలు అక్రమ రవాణాదారులను ఎండగడుతూ వారికివి సిరుపపంట పండిస్తున్న బంగారుతీగంటూ రచయిత వీరపూర్ణచందర్‌రావు అద్భుతంగా రచించారని ప్రశంసించారు. రచయితల సాహి త్యం వల్లనే సమాజంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంఘిక స్థితిగతులు తరతరాలకు తెలుస్తాయన్నారు. కమలాకృష్ణ కళాకౌముది ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని డా. కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో డా. బి.జయరాములు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి ఆత్మీయ అతిథులు పొత్తూరి సుబ్బారావు, పొత్తూరి జయలక్ష్మి, డా. గురజాడ శోభాపేరిందేవి, రఘుశ్రీ, డా. జి.శోభ, వీర ఉదయశ్రీ తదితరులతో కలిసి వందపేజీల బంగారుతీగ నవలను ఆవిష్కరించి పూర్ణ చంద ర్‌రావును శుభాభినందనలు తెలిపారు. అనంతరం డా. గురజాడ శోభాపేరిందేవి నిర్వహణలో పలువురు ప్రముఖ వర్ధమాన కవుల కవిగాయక సమ్మేళనం ఆసక్తికరంగా ఆకట్టుకుంది.

## మానవ మనస్తత్వాలు సామాజిక సమస్యలే నా రచనలకు ఇతివృత్తాలు

**- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత సయ్యద్ సలీం**



రచయితతో ముఖాముఖిలో మాట్లాడుతున్న సయ్యద్ సలీం, ఎస్వీ సత్యనారాయణ

**రవీంద్రభారతి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** సమాజం, మనుషుల స్వభావాలు, విభిన్న మనస్తత్వాలు, కనుమరుగౌతున్న మానవ విలువలు, సామాజిక సమస్యలు, ఇమిడివున్న సంఘర్షణలు నా కవిత్వానికి, కథలకు, నవలకు ఇతివృత్తాలని సుప్రసిద్ధ సాహితీవేత్త, కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, సుప్రసిద్ధ తెలుగుకవి సయ్యిద్ సలీం వెల్లడించారు. కేంద్ర సాహిత్య మంత్రిత్వశాఖ, కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, ప్రఖ్యాత సాహిత్యవేత్త డా. ఎస్.వి.సత్యనారాయణ అధ్యక్షతన రచయితతో ముఖాముఖి కార్యక్రమంలో సయ్యద్ సలీం తన జీవితం, సాహిత్యంపై ప్రసంగించారు. నా జీవితంలో ఆకలి, అవమానాలు నేర్పిన గుణపాఠాలే నా సాహితీ సృజనకు పునాదులు, చేసిన చాలా పోరాటాలే నన్నీస్థితికి చేర్చాయన్నారు. కవిత్వంతో మొదలైన సాహితీ ప్రస్థానం తర్వాత కథలు, నవలలతో విస్తరించిందని చెప్పారు. ఇప్పటివరకు 3 కవితా, 12 కథా సంపుటాలు, 37 నవలలు వెలువరించానని తెలిపారు. ఆంగ్లం, హిందీ, కన్నడ, తమిళం, మళయాళం, మరాఠీ, ఒరియా భాషల్లోకి 69 పుస్తకాలు అనువాదాలు అయ్యాయని చెప్పారు. కార్పొరేట్ విద్యావ్యవస్థ, ఆస్పతులు, మెర్సీకిల్లింగ్, చెంచుల జీవితాలు, ఎరుకల బతుకులు, ముస్లిం స్త్రీల వ్యథలు, శారీరక వైకల్యంతో బాధపడే వ్యక్తుల మనోవేదిన, దేశవిభజన వంటి విశిష్ట విభిన్న కథాంశాలతో నవలలు వ్రాసానని పేర్కొన్నారు. నా సాహితీ ప్రయాణం వీటితో ఆగిపోలేదు ఇంకా సాగిపోతూనే ఉందని జీవిత, సాహిత్య ప్రస్థానాన్ని వివరించారు. కొందరు సభికులు అడిగిన ప్రశ్నలకు సముచితరీతిన సమాధానాలుచ్చి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎస్వీ సత్యనారాయణతోపాటు ప్రొఫెసర్ సి.మృణాళిని, కరిమిండ్ల లావణ్య, డా. నాళేశ్వరం శంకరం, డా. ఎస్.రఘు తదితర సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ కోసం కేబుళ్లను తొలగిస్తున్నాం

**- విద్యుత్ శాఖ రంగారెడ్డి జోన్ సిజిఎం పాండ్యా నాయక్**



మణికొండ మున్సిపల్ అల్కాపూర్ టౌన్‌షిప్‌లో విద్యుత్ స్థంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తున్న దృశ్యం.

**నార్సింగి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** విద్యుత్ స్థంభాలకు ఇష్టానుసారంగా వేస్తున్న కేబుల్ వైర్లు, ఇంటర్‌నెట్ వైర్ల కారణంగా తరుచూ కరెంటు షాక్‌లు వచ్చి విలువైన మనుషుల ప్రాణాలు పోతున్నాయని, దీని నివారణ కోసమే కేబుల్, ఇంటర్‌నెట్ వైర్లను తొలగిస్తున్నామని విద్యుత్ శాఖ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ పేర్కొన్నారు. శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి, అల్కాపూర్ టౌన్‌షిప్ కాలనీల్లో విద్యుత్ శాఖ ఇంచార్జి ఎస్.ఇ సైబర్‌సిటీ రాంబాబు, ఇబ్రహీంబాగ్ డిఇ రమేష్‌చంద్ర, ఎడిఇ అంబేద్కర్, ఏఈ సంతోష్‌లు పర్యటించి, తమ సిబ్బంది చేత కేబుల్ వైర్లను తొలగించారు. ఈ సందర్భంగా పాండ్యా నాయక్ మాట్లాడుతూ విద్యుత్ స్థంభాలు ఉన్నది కేవలం విద్యుత్ వైర్ల కోసమని, ఇతర కేబుళ్లను వేయడం మానుకోవాలని సూచించారు. ఈ కేబుళ్ల కారణంగా ఇళ్లకు కరెంటు సరఫరా చేసే సర్వీసు వైర్లు వేసేందుకు మా లైన్‌మెన్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒకటి, రెండు విద్యుత్ వైర్లు ఉంటే 30.నుంచి 50.వరకు కేబుల్ వైర్లు వేస్తున్నారని, దీనిలో ఏది విద్యుత్ వైరో, ఏది కేబల్ వైరో తెలియడం లేదన్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో కరెంటు షాక్ కారణంగా ఐదారుగురు దుర్మరణం చెందడం బాధాకరమైన విషయమని, ఇలాంటి దుర్ఘటనలు భవిష్యత్తులో జరుగకుండా ఉండేందుకు కేబుల్ వైర్లు తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ వంశీ, సభ్యులు పి.అవినాష్, శ్రీనివాస్‌రెడ్డి, బాబురావ్, శ్రీధర్, రాజు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు చేపడుతున్న కేబల్ వైరింగ్ తొలగింపును వంశీ సమర్ధించారు. విద్యుత్ అధికారుల స్పందన చాలా బాగుందని, ప్రజల కరెంటు సమస్య పట్ల వేగంగా స్పందిస్తున్నారని తెలిపారు.

## జలమండలిలో ఏకమైన కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు

**ట్రేడ్ యూనియన్స్ జెఎసి అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి**



హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన మొగుళ్ల రాజిరెడ్డిను సన్మానిస్తున్న కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి నాయకులు

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేందుకు, కార్మికుల సేవలను సమర్థవంతంగా అందించేందుకు యాజమాన్యంతో సమన్వయంగా పనిచేయడానికి కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘాలు ఐఎన్‌టియుసి గొడుగు కింద పనిచేయాలనీ నిర్ణయించామని హెచ్‌ఎండబ్ల్యుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ ఉద్యోగ, కార్మికులు హెచ్‌ఎండబ్లుఎస్‌ఎస్‌బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఐఎన్‌టియుసి బ్యానర్ కింద ఐక్యంగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. నారాయణగూడలోని ఐఎన్.టి.యు.సి కార్యాలయంలో శనివారం జరిగిన కాంగ్రెస్ అనుబంధ జలమండలి కార్మిక సంఘాల సమావేశంలో శ్రామిక శక్తి సమిష్టి ప్రయత్నాలకు నాయకత్వం వహించడానికి హెచ్.ఎం.డబ్లు.ఎస్.ఎస్.బి ట్రేడ్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా టి.పి.రాఘవేంద్రరాజ్, ఎ.శ్రావణ్ కుమార్, మొహమ్మద్ జహంగీర్, బి.దేవేందర్, చంద్రశేఖర్, సయ్యద్ అక్తర్ అలీ, బి.నర్సింగ్ రావు, ఎం.రాజా, బి.జైరాజ్, సురేష్ బాబు, కె.రామరాజు, బి.భూమయ్యలను ఎన్నుకున్నారు. ఐఎన్‌టియుసి నాయకత్వంలో అనుబంధ సంఘాలన్నీ ఐక్యత, పారదర్శకత, నిబద్ధతతో పనిచేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి గుర్తింపు సంఘమైన బిఆర్‌ఎస్ అనుబంధ బిఆర్‌టియు నేతల చేతకానితనం వల్ల ఓవర్ టైమ్ చేసిన కార్మికులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అదనంగా పనిచేసిన కార్మికులకు ఓవర్ టైమ్ (ఓటి) అలవెన్స్ చెల్లించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జలమండలి ఎండి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. దీనితోపాటు యాజమాన్యంతో పరిష్కారం కాని కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు.

## లోక్ అదాలత్‌లలో సత్వర న్యాయ పరిష్కారం : న్యాయవాది నరేందర్



నందిగామ నరేందర్

**హైదరాబాద్ ఆగస్టు 23 ప్రభాతవార్త:** లోక్ అదాలత్‌లను సత్వర న్యాయ పరిష్కారానికి వినియోగించుకోవాలని ప్రముఖ న్యాయవాది నందిగామ నరేందర్ సూచించారు. ఇందులో భాగంగా సెప్టెంబరు 13న రాజీ మార్గమునా కేసులు పరిష్కరించుకొనుటకు జాతీయ లోక్ అదాలత్ జిల్లా, మండల స్థాయి కోర్టులో నిర్వహించబడుతుందన్నారు. లోక్ అదాలత్‌లలో న్యాయశాస్త్ర కోవిదులు, అధికార, అనధికార ప్రముఖుల సమక్షంలో స్నేహపూరిత వాతావరణంలో ఉభయ పక్షాలకు ఆమోదయోగ్యమైన తీర్పు ద్వారా కేసులలో తుదిపరిష్కారం పొందే అవకాశం ఉంటుందని ప్రముఖ న్యాయవాది నందిగామ నరేందర్ అభిప్రాయపడ్డారు. సివిల్ మరియు పరిష్కారానికి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, వాహన ప్రమాద సంబంధిత కేసులు సెట్టిల్మెంట్ ద్వారా పరిష్కరించబడుతుందన్నారు. వ్యయ ప్రయాసలు లేని సత్వర న్యాయం పొందాలంటే లోక్ అదాలత్ వ్యవస్థను వినియోగించుకోవాలని, చిరకాలంగా కోర్టులందు అపరిష్కృతంగా నిలిచిపోయిన కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని, తక్కువ వ్యవధిలో, ఖర్చులేకుండా కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని చెల్లించిన కోర్టు ఫీజులను తిరిగి వాపస్ పొందవచ్చన్నారు. భార్యభర్తల మధ్యగల వివాహ సంబంధమైన వివాదాలు, మనోవర్తి, విడాకులు, అత్తింటివారి ఆరళ్లు పిల్లల మనోవర్తి, అన్ని రకాల సివిల్ కేసులు, భూవివాదాలు, చట్టరీత్యా రాజీకీ అర్హమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ తదితర కేసులలో లోక్‌అదాలత్‌ల ద్వారా ఎలాంటి ఫీజులు, ఖర్చు లేకుండా శాశ్వతమైన, అంగీకార యోగ్యమైన సత్వర పరిష్కారాలను పొందేఅవకాశం ఉంటుందన్నారు. కోర్టులందు పెండింగులో ఉన్న కేసులలో ఇరుపక్షాలు, తమ కేసును లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించమని కోరినప్పుడు గాని, లేదా ఏ ఒక్క పార్టీ కోరినప్పుడు గానీ లేదా సదరు కేసు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించదగినదని, ఆయా కోర్టులు భావించినప్పుడు గాని, సదరు కేసులను సంబంధిత లోక్ అదాలత్‌లకు ఆయా కోర్టులు పంపవచ్చన్నారు. కోర్టువరకు కేసు వెళ్లని పక్షములో సదరు పార్టీల వారు తమ తగాదాను పరిష్కరించవలసినదిగా సంబంధిత జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని లేదా రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థను గాని కోరవచ్చన్నారు. పలు మార్లు తిరగవలసిన పని లేకుండా సుహృద్భావ వాతావరణంలో అప్పీలు లేని, న్యాయబద్ధమైన అంతిమ తీర్పు పొందాలంటే లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలన్నారు. న్యాయపరమైన శాంతి కోసం ప్రజా న్యాయ పీఠాన్ని వినియోగించుకోవాలన్నారు.

## కార్మికులందరూ లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలి : రుద్రకుమార్ యాదవ్



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని కాళీమందిర్ కార్మిక అడ్డాలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకుల దృశ్యం

**నార్సింగి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** అన్ని రంగాలలో పని చేస్తున్న కార్మికులందరూ తప్పకుండా లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు తీసుకోవాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాక్షులు జాజుల రుద్రకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కాళీమందిర్ కార్మికుల అడ్డా వద్ద సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రుద్ర కుమార్ యాదవ్ మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పతకాలకు దరఖాస్తు చేసుకొని, లబ్దిపొందాలని సూచించారు. దశాబ్దాల నుంచి భవన నిర్మాణాల్లో కార్మికులకుగా పని చేస్తున్నా ఇంకా చాలా మంది ఇన్సూరెన్స్ కార్డులు,లేబర్ కార్డులు పొందక పోవడం బాధాకరమైన విషయమన్నారు. ప్రతీ కార్మికుడికి లేబర్ ఇన్సూరెన్స్ చేయించేందుకు సిఐటియు కృషి చేస్తుందని, కార్మికులంతా స్థానికంగా ఉండే సిఐటియు నాయకులను కలిసి కార్డులు పొందాలన్నారు. నాలుగు లేబర్ కోర్టులను తొలగించాలని, ప్రభుత్వ సంక్షేమ పతకాలను ఎల్ఐసికి అప్పగించ కూడదని తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అశోక్, కార్యదర్శిగా ఇంద్రప్ప, కోశాధికారిగా మధు, ఉపాధ్యక్షులుగా ఉసేనప్ప, వెంకటప్ప, సభ్యులుగా శేఖర్, సాయప్ప, నరేష్, మాణిక్యప్ప, లాలు, భఘవంతు, నాగప్ప తదితరులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు యాదగిరి, సుభాష్, జగన్, సురేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు అన్ని స్థానాలకు పోటీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండుయాదవ్

**సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ స్థానాలు పోను మిగిలిన అన్ని స్థానాల్లో, బిసిలు, బిసి మహిళలు పోటీ చేయాలని బిసి కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బిసి యువత బిసిల వెంట ఉండి ఎన్నికల్లో గెలిపించాలని ఆయన కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లను అమలు చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని అధికారంలోకి వచ్చిన తరువాత రకరకాల పేర్లతో ఆటకెక్కించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే బిసి రిజర్వేషన్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను ఆఘమేఘాల మీద తీసుకువచ్చి అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బిసిల రిజర్వేషన్‌లపై ఎందుకు చిన్న చూపు చేస్తున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలవచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ స్థానాలను వదిలివేసి అన్ని రాజకీయ పార్టీలు బిసిలను రాజ్యాధికారంలోకి రానియకుండా అడ్డుపడతాయన్న, విషయాన్ని బిసిలు గుర్తించాలని, ఇప్పటికైనా బిసిలంతా ఐక్యమై ఒక రాజకీయ శక్తిగా ఎదగాలని, ఇందుకు ఒక వేదికను నిర్మించాలని సూచించారు. ఈ సమావేశంలో బిసి నేతలు సంధ్యరాణి, కాశీనాథ్‌ముదిరాజ్, విజయ్‌మహేంద్ర, అరుణ్‌కుమార్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

### నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎముకల వైద్యంలో మార్పులు

**చిక్కడపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త:** వైద్యచరిత్రలో ఎముకలకు సంబంధించి నూతనంగా వచ్చిన చికిత్సల ద్వారా ప్రజలకు మేలు జరిగే విధంగా సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు, డాక్టర్ వెంకటరమణ క్లీనిక్ వైద్యులు డాక్టర్ నాగులపల్లి శశికాంత్ అన్నారు. శనివారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ ఎముకల వైద్యం, శస్త్రచికిత్సకు సంబంధించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానం రావడం మూలంగా వైద్యరంగంలో సమూలమార్పులు సంభవించాయని, ఇందులో భాగంగా తాను కేవలం ఆరు గంటల్లోనే కిష్టమైన తుంటి శస్త్రచికిత్సను అత్యాధునిక నైపుణ్యంతో తక్కువ సమయంలో చేయడం జరిగిందన్నారు. ఇలా జరగడం తెలుగురాష్ట్రాల్లో మొదటిసారి అని అన్నారు. శస్త్రచికిత్స అనంతరం చికిత్స చేయించుకున్న మహిళ నడవడం జరిగిందన్నారు.

### హైకోర్టు సీనియర్ న్యాయవాది ప్రతాప్‌రెడ్డి మృతి పట్ల సంతాపం

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** హైకోర్టు సీనియర్ న్యాయవాది కే ప్రతాప్‌రెడ్డి మృతి చెందడం పట్ల ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి సత్యనారాయణ, కె.పార్థసారథి, హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డి.ప్రవీణ్, సి.రామచంద్రారెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపీ బార్‌కౌన్సిల్ సభ్యుడిగా, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యాసంస్థలను నెలకొల్పి విద్యాదానం చేశారని, ఆయన వద్ద దాదాపు 200 మంది న్యాయవాదులు జూనియర్లుగా పనిచేశారని, . అలా పనిచేసిన వారిలో కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా సైతం నియమితులయ్యారని అన్నారు. ఆయన గొప్ప మానవ హక్కుల కార్యకర్త అని, న్యాయం, ప్రజా సేవ, న్యాయానికి, సాధారణ మంచికి దృఢంగా అండగా నిలిచారని గుర్తించారు. అనేక విద్యా సంస్థలలో భాగంగా విద్యకు ఆయన ఎంతో కృషి చేశారని, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా, యునైటెడ్ ఎపి హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆయన సోషలిజం, లౌకిక వాదానికి దృఢంగా నిలబడ్డారని కొనియాడారు.

## రక్తదాన శిబిరం



రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 23, ప్రభాతవార్త**

విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి వివేకానంద నగర్, సుభాష్ భవన్ ప్రాంగణంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అనేకమంది ప్రాణాలు కాపాడబడతాయని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదానంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వల్ల రక్తదాత ఆరోగ్యానికి కూడా మేలు జరుగుతుందని, శరీరంలో కొత్త రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుందని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సోదరీమణులు, వివేకానంద నగర్ కాలనీ నివాసులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, రామ్ దేవ్ రావు వైద్య బృందం, పలువురు స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాణిసతీదాదీ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

**కంటోన్మెంట్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మహేంద్ర హిల్స్ పహాడీ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఉన్న రాజస్థాన్ వాసుల కులదైవం రాణిసతీదాదీ అమ్మవారి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఆలయ నిర్వాహకులు రాజేంద్ర అగర్వాల్, నరేష్ అగర్వాల్,రితీష్ అగర్వాల్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కాంగ్రెస్ నేత మల్యాద్రిలు పాల్గొన్నారు.

### సురవరం సుధాకర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

**సిపిఐ నగర నేత వెంకటస్వామి గౌడ్**

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు, లోక్‌సభ మాజీ సభ్యుడు, సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల సిపిఐ హైదరాబాద్ నగర నాయకుడు బాదమోని వెంకటస్వామి గౌడ్ తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేసారు. సుధాకర్ రెడ్డితో తనకు కుటుంబ సభ్యుడిగా ఉన్న అనుబంధం ఉందని, తమ పార్టీ గొప్ప నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం కలిగిన సురవరం సుధాకర్ రెడ్డి చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం అవిశ్రాంత పోరాటం చేశారని గుర్తుచేశారు.విద్యార్థి దశ నుంచే అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారని, దేశ రాజకీయాల్లో ముఖ్యంగా వామపక్ష రాజకీయాల్లో వారు క్రియాశీలక పాత్ర పోషించారని, వారి మరణంతో దేశం ఒక గొప్ప ప్రజాస్వామిక వాదిని కోల్పోయిందని పేర్కొన్నారు. ఆయన మరణంపై సీపీఐ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్ రెడ్డి మరణంతో కమ్యూనిస్ట్ ఉద్యమం ఒక సీనియర్ నాయకుడిని కోల్పోయిందని సీపీఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు పలువురు నాయకులు సానుభూతి తెలిపారు.

### రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మ : ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** రక్తం దానం చేయడం ద్వారా హాస్పిటల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి పునర్జన్మ ఇచ్చిన వారు అవుతారని, ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. శనివారం సార్వత్రిక సోదర దినోత్సవం సందర్భంగా నల్లకుంట తిలక్‌నగర్‌లో బ్రహ్మకుమారి సామాజిక విభాగం ఆధ్వర్యంలో విద్యానగర్ డిడి కాలనీ హోటల్ మేనేజ్‌మెంట్ కార్యాలయం ఆవరణంలో రక్తదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ రక్తం దానం చేయడం ద్వారా నూతన రక్త కణాలు ఏర్పడి శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవని,ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం దానం చేయాలని కోరారు. రక్తదాన శిబిరంలో 100 మంది పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలత సిస్టర్,సురేఖ సిస్టర్,కవిత సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయాలకు అతీతంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి



తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీలుకర్ర రవికుమార్

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

తెలుగుబిడ్డ, ప్రముఖ న్యాయ కోవిదుడు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఉపరాష్ట్రపతిగా గెలిపించుకోవాలని తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీలుకర్ర రవికుమార్ పిలుపు నిచ్చారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. రెండుతెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు. రాజ్యసభ సభ్యులు దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు రాజకీయాలకతీతంగా న్యాయ కోవిదుడికి ఓటు వేసి గెలిపించితే ఉపరాష్ట్రపతి పదవికి వన్నెతెచ్చిన వారవుతారని పేర్కొన్నారు. తెలుగు తేజం మరొకసారి విరాజిల్లుతుందని ఆయన అన్నారు. నీతికి .నిజాయితీకి. న్యాయబద్ధతకు నిలువుటద్దంగా జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి నిలిచారని తెలుగు ప్రజలంతా ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తున్నారని ఆయన తెలిపారు.జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మావోయిస్టు అభిమానిని, సల్వాజుడుం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని ప్రధాని మోదీ. హోం మంత్రి అమిత్ షాలు ఆరోపణలు చేయడం సరైనది కాదని ఆయన అన్నారు. సల్వాజుడుం పేరుతో అమాయకులను హత్య చేసినప్పుడు ఆనాడు ఎందుకు నోరు మెదపలేదని ఆయన ప్రశ్నించారు. సల్వాజుడుం రాజ్యాంగ వ్యతిరేకమైనది కాబట్టే ఆనాడు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తీర్పు ఇచ్చారని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, రాజకీయాలకు అతీతంగా ఎంపీలంతా ఓటు వేసి గెలిపించాలని జిలుకర రవికుమార్ కోరారు.

## మానసిక రోగుల సంరక్షకుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

**అస్మిక కేర్‌గివర్ సంఘం అధ్యక్షులు రామమోహన్‌రావు**




ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న అస్మిక కేర్‌గివర్ సంఘం నాయకులు

**ధర్నాచౌక్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** మానసిక రోగుల కుటుంబాలు మరియు సంరక్షకుల పట్ల నిర్లక్ష్యం వీడాలని, వారి భవిష్యత్తు కోసం సృజనాత్మక మార్పులు రావాలని అస్మిక కేర్‌గివర్ సంఘం అధ్యక్షులు రామమోహన్‌రావు విజ్ఞప్తి చేశారు. అస్మిక కేర్‌గివర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు ధార్నాచౌక్‌లో మానసిక వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈధర్నానుద్దేసించి రామమోహన్‌రావు మాట్లాడుతూ అంబులెన్స్‌లలో మానసిక వికలాంగులను సురక్షితంగా తరలించే సౌకర్యం కల్పించాలని, వికలాంగ సర్టిఫికెట్లు మరియు యూడీఐడీ జారీ ప్రకియను సరళీకరించాలని కోరారు. భీమా కంపెనీలు మానసిక రోగుల కవరేజిని నిరాకరిస్తున్నాయని, క్లైములను ఆలస్యం చేస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర స్థాయిలలో సమస్యలను పరిష్కరించాలని, మానసిక ఆరోగ్యాన్ని శారీరక ఆరోగ్యంతో సమానంగా పరిగణించే విధంగా మార్పులు చేయాలని, మానసిక ఆరోగ్య వ్యవస్థను నిలబెట్టే సంరక్షకులకు గౌరవం ఇచ్చి, వారికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి రఫత్ రజియా, నాయకులు శ్రీకాంత్, భైరవ ప్రసాద్, కే.సుజావతి, డాక్టర్ నిర్మల, డాక్టర్ జగన్నాధ్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



3వ వార్డు మడ్‌ఫోర్ట్‌లో బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

**కంటోన్మెంట్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శనివారం కంటోన్మెంట్‌లోని 3,4, వార్డులలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి,బోర్‌వెల్ పనులను కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి పర్చడమే ప్రధాన లక్ష్యమన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, నాయకులు రాజేశ్ యాదవ్, బిజెపి నాయకులు బి.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : ఎమ్మెల్యే తలసాని



మారేడ్‌పల్లిలో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని తదితరులు

**అడ్డగుట్ట,ఆగస్టు 23 ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి కుటుంబాలకు, ఆడపిల్లల తల్లిదండ్రులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ ఎంతో ఉపసమనం కలుగుతుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలోని తలసాని క్యాంప్ కార్యాలయంలో 15 మందికి మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అందేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి ముఖ్య మంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు, దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు మహేశ్వరీ (బేగంపేట),లక్ష్మి బాల్‌రెడ్డి (సనత్‌నగర్), బిఆర్ఎస్ నాయకులు శ్రీహరి, ఖలీల్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : జంపనప్రతాప్



1వ వార్డ బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్,పాండు యాదవ్ తదితరులు

**కంటోన్మెంట్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని శనివారం కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్, శ్రీ దేవీ నల్లపోచమ్మ, జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ,చిన్నతోకట్టలోని కట్ట మైసమ్మ ఆలయాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున ఆయా అమ్మవారి ఆలయాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు మెంబర్ పాండు యాదవ్, హ్యూమన్ ఫౌండేషన్ ఫౌండర్ ప్రకాశ్ బాటియా, నాయకులు మారుతీ గౌడ్, అజిత్, ప్రేమ్ ముదిరాజ్, నర్సింహ్మా, రామారావ్, నరేందర్, రాము గౌడ్, జాజుల క్రాంతి, విఠల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు మ్యాట్రెస్‌ల పంపిణీ



విద్యార్థులకు మ్యాట్రెస్‌లను పంపిణీ చేసిన దృశ్యం

**దుండిగల్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ దుండిగల్ తాండా 1లోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సంయుక్త వారి సౌజన్యంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ 100 బెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా విలువలకు పెద్దపీట వేసే ప్రయోజనంతో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సంయుక్త వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సిఎండి దీపక్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీ, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ప్రెసిడెంట్ రవీందర్, సిఎస్ఆర్ ప్రొఫెషనల్ సైక్లిస్ట్ గ్రూప్ భీమ్ సింగ్ నాయక్, సిఎస్ఆర్ అడ్వైసర్ గడిలా ప్రవీణ్, వార్డు ప్రెసిడెంట్ కొర్ర అమర్ సింగ్ నాయక్, అడ్వకేట్ విజయ గోపాల్ రావు, హెడ్ మాస్టర్లు వెంకటేశ్వర్లు, వెంకటయ్య, స్థానిక నాయకులు వెంకటేష్ నాయక్, మహేష్ నాయక్, రోషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కొంపల్లి మున్సిపాలిటీని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కొంపల్లి, ఆగస్టు 23, ప్రభాతవార్త**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి మున్సిపాలిటీని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జయభేరి పార్కు కాలనీ ఎన్క్లేవ్ నందు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జయభేరి పార్కు కాలనీ విసి హోమ్స్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి మున్సిపాలిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరుస్తున్నామని అన్నారు. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి పరచామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా వెలుస్తున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పన అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. అభివృద్ధిలో భాగంగా రానున్న కొద్ది రోజుల్లోనే జయభేరి పార్కు కాలనీలోని అన్ని ప్రాంతాలలో సిసి రోడ్డు పనులు, పార్కు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు వీధిదీపాల ఏర్పాటుతో పాటు వర్షపు నీటి వరద, కుక్కల బెడద సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, డిఈలు తిరుపతి, రాజు రూ, వాటర్ వర్క్స్ డిజిఎం త్రినాధ రావు, ఏఈలు ప్రవీణ్, శ్రీనివాస్, మేనేజర్ శ్రీధర్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, జయభేరి పార్కు కాలనీ వాసులు వాసుదేవ రెడ్డి, కిట్టు, నరసింహారెడ్డి, ఆనంద్, రామభద్ర రాజు, శారదా, విజిహోమ్స్ వాసులు సతీష్ గౌడ్, సురేందర్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, సత్య ప్రకాష్, శివ, కిరీటి గౌడ్, వినోద్ రెడ్డి, ప్రదీప్, భరత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో ఎమ్మెల్యే

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**యూసుఫ్‌గూడ, ఆగష్టు 23, ప్రభాతవార్త :**

మహిళలు అన్నిరంగాలలో పురుషులకు ధీటుగా రాణించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ఇందిరా క్రాంతి పథకం మహిళా పొదుపు పరపతి పథకం కార్యక్రమంలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు వంద పొదుపు గ్రూప్ పరపతి మహిళా సంఘం సభ్యులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీలలో మధ్యతరగతి మహిళలు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహిళల హక్కుల గురించి అవగాహన కల్పించారు. దేశప్రధాని నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి అయిన తర్వాత మహిళలు ధైర్యంగా బ్యాంకులకు వెళ్లి అకౌంట్లు ఓపెన్ చేసుకున్నారని తెలిపారు. గతంలో 50 వేలు పొదుపు గ్రూపులు ఉండగా మోడీ ప్రధాన మంత్రి అయిన తర్వాత కేంద్ర ప్రభుత్వం నుంచి పొదుపు గ్రూపులకు రూ.20 లక్షల వరకు పెంచటం జరిగిందన్నారు. నరేంద్ర మోడీ దేశ ప్రధాని అయిన తర్వాత గ్రామాలల్లో మరుగు దొడ్ల నిర్మాణం మహిళలు ఆత్మగౌరవంగా ఉండేందుకు దేశంలో ప్రధాన మంత్రి నిధుల నుంచి స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో మొదటగా ఈ పథకాలను తీసుకువచ్చారన్నారు. బేటీ పడావో బేటీ బచావో( ఆడపిల్లలను చదువు కోవాలని ఆడపిల్లలను చదివించండి, ఆడప్లిలలే ఇంటికి దేవతలు) తల్లిదండ్రులు ఆడ పిల్లల పట్ల వివక్షత చూపకూడదని సూచించారు. ఆపరేషన్ సింధూరులో ఫైలట్లుగా మహిళలు ఎక్కువ మంది నడిపారని గుర్తు చేశారు. మహిళా సంఘాలు ఏర్పడ్డాక ఆయా బస్తీలల్లో ప్రజా సమస్యలపై గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యే దిశగా కృషి చేయాలన్నారు. మహిళలు సంఘాలుగా ఏర్పడి పొదుపు చేసుకున్న ఆ డబ్బులతో చిరు వ్యాపారాల్లో లాభాలను గడించాలని స్వయంగా ఎదగడానికి ఈ గ్రూప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గౌతమ్‌రావు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, డివిజన్ బీజేపీ అధ్యక్షులు లక్ష్మణ్, అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, సుప్రియాగౌడ్, కుంభాల గంగరాజు, ప్రేమ్ కుమార్, అట్లూరి రామకృష్ణ, బోరబండ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొత్తా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




ఎస్పీఆర్ హిల్స్‌లో మహిళా పొదుపు సంఘాల సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి.

## బిసిల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి : గుజ్జ సత్యం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**

చట్టపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో చేపట్టనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకువెళ్లాలని ప్రభుత్వం ఘర్షణ పద్దతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్దతి ఆలోచించి రిజర్వేషన్లను పెంచే న్యాయమార్గాన్ని మార్గాన్ని ఆలోచించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించి ధర్నాలు చేస్తే సరిపోదని, బిసి సంఘాలు, ప్రజా సంఘాల చేయ వలసిన కార్యక్రమం బిసి రిజర్వేషన్ సాధన కోసం కేంద్రంతో సానుకూలంగా ఉండి అఖిల పక్షంతో, అన్ని రాజకీయ పార్టీలతో మాట్లాడి పరిష్కారించి సాధించాలన్నారు. రాజకీయంగా బీసీలను అణగదొక్కేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లపై వివిధ రాజకీయ పార్టీలు, బీసీ సంఘాలు, కుల సంఘాలతో కూడిన అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రిజర్వేషన్లు అమలయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని కలిసి రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురాం నేత, నీలం వెంకటేష్, రాజేందర్, అనంతయ్య, రాజు నేత, మణికంఠ , పెద్ది జగదీష్, జెల్ల నరేందర్, శివకుమార్ యాదవ్, నరేష్‌గౌడ్, లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25న జరిగే సత్యాగ్రహ దీక్షకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.



25న జరిగే బిసి సత్యాగ్రహ దీక్ష వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గుజ్జ సత్యం, నీలం వెంకటేష్ తదితరులు

## ప్రజల్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకోండి : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 23, ప్రభాతవార్త**

స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి వెళ్లి తెలుసుకోవాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శనివారం నియోజకవర్గ కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు విసుగెత్తిపోయారని ఏ సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని కరెంటు, డ్రైనేజ్, రోడ్లు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు కూడా సరిగ్గా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లోకి వెళ్లి పాదయాత్రల ద్వారా వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ప్రజలు సతమతమైపోతున్నారని గత పది ఏళ్లలో కెసిఆర్ ప్రభుత్వంలో ఎంతో ఆనందంగా హాయిగా జీవించేవారని నేడు ఆ పరిస్థితి కానరావడం లేదని అందరూ కూడా బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కనీసం శాంతి భద్రతలు కూడా పట్టించుకునే స్థితికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ధైర్యం చెప్పే విధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీష్ అరోరా, కార్పొరేటర్లు ముద్దాం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, మహేశ్వరి శ్రీహరి, పగుడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్లు, తూము శ్రవణ్ కుమార్, పగడాల బాబురావు మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు

## పారిశుధ్య సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం

**: కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ**

**జీడిమెట్ల, ఆగస్టు 23, ప్రభాతవార్త**

సుభాష్ నగర్ డివిజన్ ఎస్సార్ నాయక్ నగర్‌లో కాలనీ గడ్డి బాగా పెరుగుపోవడంతో అలాగే చెత్తాచెదారం ఎక్కువ అవడంతో పాములు తిరుగుతున్నాయనీ స్థానిక కాలనీ వాసులు సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, కాలనీ మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషాచారిల దృష్టికి పలు సమస్యను తీసుకురావడం జరిగింది. ఇదే విషయంపై కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణిలో ఉప కమిషనర్ నరసింహకి ఫిర్యాదు చేయడం జరిగింది. కాగా శనివారం ఉదయం ఉప కమిషనర్ ఎస్ఆర్ నాయక్‌కి వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే శానిటేషన్ వారితో మాట్లాడి అక్కడ పనిని పూర్తి చేయవలసిందిగా వారిని నరసింహా ఆదేశించారు. అక్షర స్కూల్ దగ్గరలో కూడా విష సర్పాలు వస్తున్నాయని అక్కడ ఉన్న అపార్ట్మెంట్ వాసులు మా దిష్టికి తీసుకువచ్చారు. రానున్న రోజుల్లో సమస్యలు తలెత్తకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పివి భాస్కర్ రెడ్డి, కూరపాటి ప్రభాకర్ , హరిబాబు యాదవ్ కండక్టర్ వెంకటేశ్వరరావు , కిషోర్ , పొన్నాడ శ్రీనివాస్ పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## బిసిల రిజరేషన్‌లకు ముస్లిం రిజర్వేషన్‌లు అడ్డుకాదు : ఎర్ర సత్యనాయణ

**సైఫాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** బిసిల 42 శాతం రిజర్వేషన్‌లకు ముస్లిం రిజర్వేషన్‌లు అడ్డు కాదని, ఈ అంశాన్ని బిజెపి తీసుకుని పూర్తి చేయాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యానారాయణ డిమాండ్ చేశారు. కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ చేసిన బిసిల డిక్లరేషన్‌ను బిజెపి ముస్లిం రిజర్వేషన్‌లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన బిసిల రిజర్వేషన్‌ల బిల్లుకు ముస్లింల రిజర్వేషన్‌లకు ఏలాంటి సంబంధం లేదని, 1 శాతం కూడా ముస్లింలకు రిజర్వేషన్‌లు పోవని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేస్తూ ఆనేక బిల్లులను అమోదించిందని, కాని బిసిల బిల్లును 9వ షెడ్యూల్డ్‌లో చేర్చకుండా ముస్లింల పేరిట మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు బిసిల రిజర్వేషన్‌లను రాజకీయంగా చూస్తున్నాయే తప్పా, బిసిల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఉప రాష్ట్రపతి ఎంపికలో టిడిపి, బిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపిల మద్దతు కోరిన సిఎం రేవంత్‌రెడ్డి, బిసిల 42 శాతం రిజర్వేషన్‌ల అంశంలో ఎందుకు మద్దతు కోరడం లేదన్నారు. ఇప్పటికైన రాష్ట్రంలోని బిజెపి నేతలు కేంద్ర ప్రభుత్వంపై వత్తిడీ చేసి 42 శాతం రిజర్వేషన్‌లను 9వ షెడ్యూల్డ్‌లో చేరేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బిసిలు తగిన గుణపాఠం చెపుతారని హెచ్చరించారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

### అధికారులు తక్షణమే డ్రైనేజీ సమస్య పరిష్కరించాలి



సమస్యను పరిశీలిస్తున్న సతీష్‌రావు

**కెపిహెచ్బి కాలనీ, ఆగస్టు 23, ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లోని చాలీస్ మఖాన్‌లో గత కొన్ని నెలలుగా డ్రైనేజ్ నీళ్లు పొంగుతూ రోడ్ల మీద ప్రవాహిస్తు స్థానికుల ఇళ్లలోకి కూడా పోవడంతో స్తానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బి.ఆర్.ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి తక్షణమే సంబందిత అధికారులు సమస్యను పరిష్కరించి మరలా ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రీతి, ఫజల్, ఫరీదా బేగం, లక్ష్మి, రాములు గౌడ్, జగదీష్, మాధవరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లు ఆక్రమణలుపై చర్యలు: ఎసిపి శ్రీనివాస్ రెడ్డి



కాలనీ వాసులుతో ఎసిపి

**అల్వాల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఇంటి నిర్మాణదారులు నియమ నిబంధనలు పాటించాలని అల్వాల్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఎంహెచ్ఆర్ కాలనీలో పర్యటించిన ఆయనకు స్థానికులు పలు సమస్యలను వివరించారు. సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందని కాలనీ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి తెలిపారు. రోడ్లు ఆక్రమణలు, నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని ఎసిపి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన బుచ్చిరెడ్డి, సంతోష్ కుమార్, ఆనంద్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరామ్ బస్తీ వాసులు సమస్యలు పరిష్కరిస్తాం



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందిస్తున్న బస్తీ వాసులు

**అల్వాల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**

శ్రీరామ్ కమ్యూనిటీ బస్తీ వాసులు సమస్యలు అన్నింటిని పరిష్కరిస్తామని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం కార్పొరేటర్‌ను బస్తీ వాసులు కలిసి డ్రైనేజీ, సిసి రోడ్లుకు సంబంధించిన సమస్యలను వివరించారు. అధికార యంత్రాంగాన్ని సంప్రదించి సమస్యలు పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత అనీల్ కిషోర్ బస్తీ వాసులు శంకర్, విజయ శేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### మృతి చెందిన గౌడ్‌లకు తక్షణమే ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

**సైఫాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది గౌడ్‌లు గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ గౌడ కల్లు గీత వృత్తిదారుల సమన్వయ వేదిక, కల్లు గీత వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి వి.శ్రీనివాసగౌడ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ 20 నెలల పాలనలో 1147 గీత కార్మికులు మృతి చెందారని, వారికి తక్షణమే ఎక్స్‌గ్రేషియా 10 లక్షల చొప్పున కేటాయించాలని, బార్‌లు, వైన్స్ షాపులలో కల్లుగీత సొసైటీలకు 25 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, కల్తి కల్లు పేరుతో మూసివేసిన కల్లు దుకాణాలను వెంటనే తెరిపించాలని, జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరును పెట్టాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘా నేతలు బాలగోని బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, అంబాల నారాయణ గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వారు కల్లు గీతవృత్తిలో మరణించిన గౌడన్నలకు కొవ్వోత్తులు వెలిగించి, పూలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు.

### వికలాంగులకు వీల్‌చైర్స్ అందజేత



వికలాంగులకు వీల్‌చైర్స్‌ను అందజేస్తున్న ప్రముఖ సంఘసేవకులు, ఎస్వీ.సర్జికల్ కార్పొరేషన్ నిర్వాహకుడు అందే నరసింహం

**హైదరాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**

సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రముఖ సంఘసేవకులు, ఎస్వీ.సర్జికల్ కార్పొరేషన్ నిర్వాహకుడు అందే నరసింహం వికలాంగులకు కృత్రిమ అవయవాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులకు వీల్‌చైర్స్‌ను అందే నరసింహం కుమార్తె ఎ.స్వేచ్ఛ జన్మదినోత్సవం సందర్భంగా నిమ్స్ డైరెక్టర్‌కు అందజేశారు.


తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC
టెండర్ ప్రకటన ('ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా)

నిట్ నం. 15/EE/GHMC/Div-21/2025-26, తేది: 23.08.2025

పైన పేర్కొన్న నిట్ నం. ప్రకారం (ఐటమ్ నం. 01 నుండి 06) తేది 23.08.2025. 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ద్వారా (06) పనుల కొరకు అంచనా ధర రూ. 104.80 లక్షలతో టెండర్లు పిలువబడుచున్నాయి. బిడ్స్ యొక్క విక్రయం వెబ్‌సైట్ 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ పై 25.08.2025న మ.2.00గం. నుండి ఆన్ లైన్ లో తెరువబడును. బిడ్స్ యొక్క దాఖలుకు చివరి తేదీ : 01.09.2025 మ.2.00గం. వరకు. దాఖలు సమయానికి ఒక గంట ముందు బిడ్స్ విక్రయం ముగించబడుతుంది. తదుపరి వివరాలు వెబ్‌సైట్ https://tender.telangana.gov.in పై చూడవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్-21, SLP జోన్: GHMC.

DIPR.NO.6972-PP/CL/ADVT/1/2025-26 తేది: 23.08.2025

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ** GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు నోటీసు

సంక్షిప్త టెండర్ నిట్ నెం. 20/EE-6/CRZ/GHMC/2025-26, తేది: 13.08.2025

పని యొక్క స్వభావం : 1 బిటి రోడ్ మరియు 2 ఇతర పనులు, అంచనా ధర (రూ.లక్షలలో): 48.70, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు మరియు సమయం : డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.08.2025 మ.03.00గం. వరకు. బిడ్స్ స్వీకరణ చివరి తేది: 26.08.2025 మ.3.00గం. వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నం. శ్రీ ఎం.పీరెసింగ్, EE, డివిజన్-6, CRZ, GHMC, హైదరాబాద్, ఫోన్ నం. 9154960551. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. గమనిక: టెండరు ప్రకటన యొక్క తేదీ తరువాత 1% బయానా పొందవచ్చును.

సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-6, చార్మినార్ జోన్, GHMC.

DIPR.NO. 6993-PP/CL/ADVT/1/2025-26 తేది: 23.08.2025

వార్త CLASSIFIEDS

**FOR SALE**

★ 200 yards plot with boundry wall, 40 ft road access, for sale in tejaswi nagar, attapur. Contact 9581491919.

(Ro.No. 19885)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT AT: KUSHAIGUDA**
**O.S.No. 530 OF 2025**

BETWEEN: -
**Smt. V. Bhargavi and another** ...Plaintiffs
AND
**1. The Tahsildar,** Alwal Mandal, Surya Nagar Road, Old Alwal, Medchal-Malkajgiri Dist.
**2. All Concerned** ...Defendants
To,
**All Concerned**

Please take notice that the Plaintiffs herein has filed the above Suit for declaration of Plaintiff's as legal heirs of the deceased Vipparthi Bheema Raju died intestate on 28-03-2025 in respect of the Suit Schedule Property. The above Said case is posted to **09.09.2025** at 10.30 am. In the above Court, If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

( By order of the Hon'ble Court )
Sd/- **M/s. V. SRIKANTH, K. ROHIT**, Advocates, H.No.2-10-6/61, Rukmini Enclave, Bollarum, Alwal Mandal, Medchal-Malkajgiri District.

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CCC AT: SECUNDERABAD**
**O.S. No. 670 of 2025**

**Between:**
Sri Suresh kalesha Mogre and 3 Others ...**Plaintiffs**
**AND**
1. The Tahsildhar, Trimulgherry Mandal, Secunderabad.
2. All concerned. ...**Defendants**
To
All concerned
Sir'

Please take notice that the above Plaintiffs has filed a suit for Declaration to declare plaintiffs as legal heirs of the deceased Late **SMT. KASTHURI SURESH MOGRE** and the same is now stands posted on 09-09-2025 for appearance of all concerned and Written Statement if any. Please make it convenient to present either in person or through Counsel before the above Hon'ble court at **10-30 a.m. on 09-09-2025.** If you fail to appear on the above date the matter will be heard exparte.

**// BY ORDER OF THE COURT //**
**Sd/- K. Prashanth** Advocate. #41, Ishaq Colony, Wellington Road, AOC Center, Secunderabad -15. **Ph: 8106767620.**

**IN THE COURT OF THE HON'BLE SPL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS (Excise) cum V ADDNL JUNIOR CIVIL: V ADDNL METROPOLITAN MAGISTRATE R.R. COURTS :: AT L.B. NAGAR**
**O.S.No. 604 of 2025**

**Between:-**
1. Smt : Kavitha Bachu W/o: Late: B. Raju: Age: 46 Occ: House wife.
2. Sushma Bachu : D/o: Late: B. Raju: Age: 26 Occ: Student.
3. Sruthi Bachu: : D/o: Late: B. Raju: Age: 24 Occ: Student (Plaintiff No 1 to 3 are the R/o: 6-5/1, Bhavaninagar, Dilsukhnagar, R.R. Dist.) ..**Plaintiffs**
**AND**
1. The Tashildar, Saroornagar, Revenue Mandal, R.R. Dist, Telangana State.
2. All Concerned .. **Defendants**

That the above named Petitioners are filed suit for declaration and subsequently that this Hon'ble Court was pleased to ordered for paper publication if any concerned person or persons claiming as the legal heirs of Late : Bachu Raju : S/o Late : Pachanandam, may present before the Hon'ble Court on 2-9-2025 , at 10-30. A.M, along with related documents or else, this Hon'ble court may take appropriate steps for further proceedings.

**(By order of the Court)**
**CH.V. MARUTHI KUMAR V. KIRAN KUMAR** Advocates H.No. 5-100, Bhavaninagar, Dilsukhnagar, Hyderabad **9849433406, 040-24040812.**

**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIO CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**
**O.S.No. 590 of 2025**

**Between:**
Kollu Anantha Srinivasa Rao & others ... **Plaintiffs**
**AND**
Kollu Venkata Papa Rao & another ... **Defendants**

**NOTICE**

To
To whomsoever it may concerned ... **Defendant No.2**

Please take notice that the above named Plaintiffs filed a suit for declaration to declare them as the legal heirs of late Smt Kollu Neeraja, W/o. Kollu Anantha Srinivasa Rao and perpetual injunction against Kollu Venkata Papa Rao & to whomsoever it may concerned and the above said suit is posted on 25-09-2025 for appearance and objections if any from whomsoever it may concerned.

Therefore, I, hereby requested to whomsoever it may concerned to appear in the above said suit either in person or through an advocate on 25-09-2025 at 10.30 A.M., before the above Hon'ble Court otherwise the matter will be decided in your absence as per law.

**// BY ORDER OF HON'BLE COURT //**
**M. CHANDRA SEKHAR ADVOCATE** R/o Plot No.8, PSR Residency, BHEL Vista, Near Praga Tools, Beside Dandamudi Enclave, Jeedimetla, Hyderabad-500055 **Cell: 93938 04880**

**PUBLIC NOTICE**
**To whom so ever it may concern**

The General public are hereby informed that my client Mohammed Hakeem S/o Mohd Afzal Miyan, Aged about 47 yrs, Occ: Business, R/o H.No.8-15-96/39/A, Mailardevpally Shama Colony, Hyderabad, has been entered into an agreement of sale, in respect of Plot bearing No.102, adm 506.67 Sq Yds, Sy No.107, situated at Mansoorabad Village, Hyderabad East, Ranga Reddy Dist, TS From its owner Sri Syed Ghasiq Ahmed S/o Late Syed Siddiq Ahmed R/o H.No.19-2-21/23, F/E 7, Macca Colony, Mega Tea Point, Tadban, Charminar, Falaknuma, Hyderabad TS-500 053 (Aadhaar No___ 1585).

Sri Syed Ghasiq Ahmed S/o Late Syed Siddiq Ahmed being the Legal Heir/Owner vide Affidavit dt 24 Jan 2022 Issued by Hon'ble Spl Judicial Magistrate, Bhongir, he has received substantial amount from my client and agreed to execute the registered sale deed by receiving balance sale consideration. Therefore, In case, any body have got any claim or objection to the above sale transaction, they may contact me, at the under mentioned address within a one week from the date of publication of this notice along with supporting material documents, if any, failing which, my client shall proceed with the sale transactions treating the said property is free from third party claims. Any objections or claims received thereafter does not binding on my client.

**Sri P GOVERDHAN REDDY, Advocate,** H.No.4-3-118, Road No.6 Mallikarjuna Colony, Bandlaguda Jagir, Don Bosco Post, Gandipet Mandal, Ranga Reddy Dist-500 086. **Ph: 9948072883**

## వినాయక చవితి శాంతియుతంగా జరుపుకోవాలి

### -ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్



**నేరేడ్‌మెట్, ఆగస్టు 23,ప్రభాతవార్త :** వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణం లో జరుపుకోవాలని మండప నిర్వహకులకు నేరేడుమెట్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ సూచించారు. శనివారం నేరేడ్మెట్ పరిధిలో వినాయక చవితి ఏర్పాట్లను శాంతి భద్రతల దృష్ట్యా మహా బోధి ఫంక్షన్ హాల్ లో మండపనిర్వాకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు, గణేష్ మండప నిర్వాహకులతో వివిధ అంశాలపై చర్చించారు. నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ప్రతిష్ఠా రోజు నుండి నిమజ్జన చేసే రోజు వరకు ప్రతి మండప నిర్వాహకుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మండపాల వద్ద భద్రతా చర్యలతో పాటు ఊరిగెంపు వేళ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండగ శాంతియుతంగా సాగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని, ఎవరు ఐన చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసుల కు సమాచారం అందించాలని మండప నిర్వాహకులను కోరారు. స్థానిక సమాజం, యువత కూడా బాధ్యతతో వ్యవహరిస్తే వినాయక చవితి ఉత్సవాలు ఏ ఇబ్బంది లేకుండా సాగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు."మనం అందరం కలిసికట్టుగా పని చేస్తే పండగలు ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుగుతాయి" అని ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ మండపాల నిర్వాహకులు భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు రక్తదానం చేయడానికి ముందుకు రావాలి: ఎమ్మెల్యే బలాల



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో బ్రహ్మకుమారి డాక్టర్ ఉమారాణి తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 23, ప్రభాతవార్త:** రక్తదానం చేయడానికి ప్రజలు ముందుకు రావాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ప్రపంచ బ్రహ్మకుమారిస్ 18 అసెన్షన్ డేని పురస్కరించుకొని మలక్ పేట్ దయానంద నగర్ లోని బ్రహ్మకుమారిస్ మలక్ పేట బ్రాంచ్ లో తల సేమియా సికిల్ వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఎంతో విలువైన ప్రాణాలను కాపాడిన వారమవుతామని తెలిపారు. తల సేమియా సికిల్ వ్యాధిగ్రస్తుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం ఎంతో మంచి కార్యక్రమమని నిర్వాహకులను అభినందించారు. మలక్ పేట బ్రాంచ్ బ్రహ్మకుమారిస్ నిర్వాహకురాలు డాక్టర్ ఉమా రాణి దిది మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీవాసులకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టాలి



ద్వారకా నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్.

**వనస్థలిపురం. ఆగస్టు.23.ప్రభాతవార్త.** ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు హస్తినపురం డివిజన్ పరిధిలోని ద్వారక నగర్ కాలనీ నందు ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ శ్రీ.హేమంత్ కేశవ్ పాటిల్ గారిచే కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ గతంలోనే ఎన్నికల ముందు దాదాపు రెండు కోట్ల రూపాయల వ్యయంతో వరదనీటి డ్రైన్స్ మంజూరు కావడం జరిగిందని గుర్తు చేశారు.అట్టి పనులు పూర్తి కావడం జరిగింది. కానీ అట్టి రోడ్డు పనుల్లో భాగంగా పక్క కాలనీలు డి.ఆర్.డీ. ఎల్.కాలనీ మరియు ద్వారక నగర్ కాలనీల రోడ్లు ధ్వంసం కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని తెలిపారు.అలాగే అదనపు వరదనీటి డ్రైన్స్ పనులు కూడా గతం లోనే మంజూరు కావడం జరిగింది అని అట్టి పనులు కూడా వెంటనే ప్రారంభం చేయాలని కోరారు.వెంటనే జోనల్ కమిషనర్ గారు పక్కన ఉన్న అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.నూతన రోడ్డు మంజూరు చేయడం జరిగింది అని,అలాగే వరదనీటి డ్రైన్స్ పనులు కూడా అతి త్వరలోనే పనులు చేయిస్తామని తెలిపారు.దానికి కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పద్మ శ్రీనివాస్ నాయక్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పేద మహిళకు నగదు వితరణ



శివమ్మకు నగదు అందజేస్తున్న మహేష్‌యాదవ్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఎవరు లేని నిరుపేద మహిళకు చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ చేయూతను అందించారు. చైతన్యపురి డివిజన్‌కు చెందిన శివమ్మ తన భర్త వెంకటయ్య, కుమారుడు కృష్ణలను వరుసగా కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న శ్రీశైలం ద్వారా సమాచారం తెలుసుకున్నాం తోట మహేష్‌యాదవ్ శనివారం శివమ్మను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి దిగులు చెందవద్దని తాము అండగా ఉంటామని మహేష్ యాదవ్ హామీ ఇవ్వడంతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆమెకు భరోసా కల్పించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని తాను అందుబాటు లో ఉంటామని తెలిపారు.

# సురవరం చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



ఆర్.ఎన్.ఆర్ కాలనీలో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు.



సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఐ పార్టీ నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీంద్రాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. హయత్‌నగర్, ఆర్.ఎన్.ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద ప్రజలకోసం తుది శ్వాస వరకు ఆయన చూపిన పోరాట పటిమ రాబోయే తరాలకు ఆదర్శనీయ మన్నారు. అటువంటి మహా నాయకుడి చరిత్రను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చి, ఆయన స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ అబ్దుల్లాపూర్ మెట్, హయత్ నగర్ మండలాల కార్యదర్శులు హరిసింగ్ నాయక్, శ్రీదేవి, సహాయ కార్యదర్శి కర్ణే సుజాత, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో...**

**తుర్కయంజాల్ ఆగస్టు 23, ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో సిపిఐ పార్టీ జాతీయ నాయకులు మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు ఒరుగంటి యాదయ్య, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి కాటంరాజు ,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర విభజన ఉద్యమంలో సిపిఐ పార్టీ ఆంధ్ర తెలంగాణ క్యాడర్లో విభేదాలు వస్తాయని తెలిసి కూడా అందర్నీ సమన్వయం పరచడంలో తెలంగాణ ఉద్యమానికి క్రియాశీల పాత్ర పోషించడంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి వారు కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీకాంత్ ,కౌన్సిల్ నాయకులు అనురాధ,వట్టి విజయ ,భాస్కర్,శ్రీను గౌడ్,కోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వరద నీటి సమస్యను పరిష్కరించడానికి కృషి

### -ఇన్‌చార్జ్ ఎస్‌జిఎస్ చిలక నరసింహారెడ్డి

**మలక్ పేట,ఆగస్టు 23, ప్రభాతవార్త:** ఉస్మాన్ గంజ్ మార్కెట్ లో వరద నీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఉస్మాన్ గంజ్ మార్కెట్లోని దుకాణాల్లో వర్షపు నీరు చేరి సరుకు పాడవుతోందని తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఉస్మాన్ గంజ్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్, సభ్యులు, పలువురు వ్యాపారస్తులు హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నరసింహారెడ్డి ని కలిసి విన్నవించారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ లోని కార్యాలయంలో ఆయనను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. కొద్దిపాటి వర్షాలకి వరద నీరు దుకాణాలలోకి చేరడంతో తమ సరుకులు పాడైపోతున్నాయని, దీంతో తాము నష్టపోతున్నామని వారు తెలియజేశారు. తమ సమస్యను పరిష్కరించేంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఇంచార్జ్ ఎస్ జి ఎస్ చిలక నరసింహారెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉస్మాన్ గంజ్ మార్కెట్ ను సందర్శించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



వ్యాపారస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఇన్చార్జి ఎస్ జి ఎస్ చిలక నరసింహారెడ్డి

**మలక్ పేట మార్కెట్లో సూచిక బోర్డుల ఏర్పాటు: ఇన్చార్జి ఎస్ జి ఎస్ చిలక నరసింహారెడ్డి**

మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో రైతులు, వ్యాపారస్తులు ,వినియోగదారుల సౌకర్యార్థం అన్ని దారుల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు ఇంచార్జ్ చిలక నరసింహారెడ్డి పేర్కొన్నారు. మార్కెట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్లోని అన్ని రహదారుల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయడానికి నిర్ణయించడం జరిగిందని, ఏ రహదారిలో ఏ దుకాణాలు ఉన్నాయో, ఏమేమి సరుకులు లభిస్తాయనే వివరాలతో సూచిక బోర్డు లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. మార్కెట్లో ఉల్లిపాయలు, మిర్చి, చింతపండు క్రయవిక్రయాలు జరుగుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి సరుకులతో మార్కెట్ కు వచ్చే రైతులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు.

## చాదర్‌ఘాట్ మూసి పరివాహక ప్రాంతం నివాసాలలోకి త్రాచుపాము పిల్లలు

**భయాందోళనలకు గురవుతున్న స్థానిక ప్రజలు**

**మలక్ పేట ,ఆగస్టు 23, ప్రభాతవార్త:** చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి ఉన్న నివాసాలలోకి త్రాచుపాము పిల్లలు ప్రవేశించడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గత కొంతకాలంగా కురిసిన వర్షాల నేపథ్యంలో మూసి నది ఉధృతంగా ప్రవహించడంతో చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి వరద నీరు స్థానిక నివాసాలలో చేరిన సంగతి విధితమే. మూసి పరివాహక ప్రాంతం వెంబడి ఏర్పాటుచేసిన మెష్ దెబ్బ తినడంతో పాటు శాశ్వతంగా రిటైనింగ్ వాల్ ను నిర్మించకపోవడంతో త్రాచుపాము పిల్లలు జనావాసాలలోకి ప్రవేశిస్తుండడంతో స్థానిక ప్రజలు తమ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని బతుకుతున్నారు. శనివారం త్రాచు పాము పిల్లలు చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతంలో ఉన్న నివాసాలలోకి రావడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. వెంటనే చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతం వెంబడి రిటైనింగ్ వాల్ ను నిర్మించాలని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.



చాదర్ ఘాట్ మూసి పరివాహక ప్రాంతంలో నివాసాలలోకి ప్రవేశించిన త్రాచుపాము పిల్ల దృశ్యం

## చెరువులను సుందరీకరంగా తీర్చిదిద్దడానికి కృషి : సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరణతో అభివృద్ధి చేసి ప్రజలకు చక్కని ఆహ్లాదాన్ని అందించే విధంగా తయారు చేయడానికి కృషి చేస్తున్నామని మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యురాలు పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. శనివారం ఆమె బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మీర్‌పేట్–బడంగ్‌పేట్ గ్రామాల మధ్య ఉన్న పెద్ద చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఏర్పాటైన వాకింగ్ ట్రాక్‌ను, ఇరు వైపులా నాటిన మొక్కలను, షాబాద్ బండల ఫ్లోరింగ్‌ను, ఫెన్సింగ్ నిర్మాణాన్ని, ట్రాక్ పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, లైట్లను అదే విధంగా చెరువు బయటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ గేటును ఆమె పరిశీలించారు. అనంతరం సబితా రెడ్డి మాట్లాడుతూ గతంలో సాగు నీటి అవసరాలు తీర్చిన చెరువులు ప్రస్తుతం భూగర్భ జలాల పరిరక్షణకే పరిమితమయ్యాయని తెలిపారు. అయితే చెరువులను అభివృద్ధిపరంగా సుందరీకరణ చేసి తీర్చిదిద్దడం ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా తయారు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గంలో నిర్దేశించిన చెరువులను దశల వారీగా అభివృద్ధి చేయడం జరుగుతున్నదని ఆమె వివరించారు. ఇప్పటికే పనులు పూర్తి అయిన చెరువులు సందర్శకులను ఆహ్లాదపరుస్తున్నాయని ఇది తమకు సంతృప్తినిస్తున్నదని సబితారెడ్డి వెల్లడించారు. అనుకున్న విధంగా చెరువులను సుందరీకరించి ప్రజలకు ఉపయోగంలోకి తెస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి జఠావత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు దోమలపల్లి రాజ్‌కుమార్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రామిడి నర్సిరెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి తదితరులతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఖలీల్ పాష పాల్గొన్నారు.



మీర్‌పేట్ పెద్ద చెరువు సుందరీరకరణ పనులను పరిశీలిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

## క్వాంటం కంప్యూటింగ్ ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన

**నేరేడ్ మెట్, ఆగస్టు 23, ప్రభాతవార్త**

భవన్స్ వివేకానంద కళాశాలలోని భౌతికశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ (ఐఏపిటిఆర్సి 22) సహకారంతో క్వాంటం కంప్యూటింగ్ సంవత్సరంను పురస్కరించుకొని ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి. సుబ్రహ్మణ్యం, ఐఐఐటి హైదరాబాద్ సహాయ ఆచార్యుడు డాక్టర్ ఇంద్రనీల చక్రవర్తి ముఖ్య అతిథులుగా హాజరై ఉపన్యాసాలు అందించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 127 మంది విద్యార్థులు పాల్గొని కొత్త సాంకేతిక పరిజ్ఞానాలపై విశేష అవగాహన పొందారు.అనంతరం నిర్వహించిన పోస్టర్ ప్రదర్శన పోటీలో క్వాంటం కంప్యూటింగ్" అంశంపై 24 బృందాలు పాల్గొన్నాయి. ఇందులో డాక్టర్ ఇంద్రనీల చక్రవర్తి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలతో, పరిశోధనా దృక్పథంతో సమగ్ర విశ్లేషణలు ప్రదర్శించడం విశేషం.

## అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించిన నేతలు



**సరూర్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ గ్రామంలో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్న శిథిలావస్థలోని అంగన్‌వాడి కేంద్రాన్ని శనివారం కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జగన్‌రెడ్డి, బండ్లగూడ సొసైటీ డైరెక్టర్ అన్ను పెద్ద శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సుల్తాన్ పూర్ నాయకుడు కళ్లెం మురళీధర్‌రెడ్డి తది తరులు సందర్శించారు.ఈ సందర్భంగా వారు కురిసిన భారీ వర్షాలకు నాని నిమ్మిచ్చిన అంగన్‌వాడి కేంద్రం పరి స్థితిని పరిశీలిం చారు. ఎన్నో ఏళ్లుగా కురిసిన వర్షాలకు గది గోడలు బాగా నాని శిథిలావస్థకు గురైన భవనంలో అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులు ఉండడం, అదేవిధంగా ఇదే భవనంలో గర్భిణీల కు సైతం వైద్య పరీక్షలు నిర్వహిస్తుండ దంపట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## బైబిల్ థియోలాజిలో డాక్టరేట్ సాధించిన ప్రశాంత్‌కుమార్



ప్రశాంత్‌కుమార్‌కు డాక్టరేట్ అందజేస్తున్న రాజ్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మోహన్ నగర్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్ బైబిల్ థియోలాజిలో పీహెచ్డీ చేసి చిన్న వయసులోనే డాక్టరేట్ సాధించారు. ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ చర్చి మానేజ్మెంట్ వారి ద్వారా శనివారం చెన్నైలోని వండలూరులో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ సెరెమొని 2025 కార్యక్రమంలో జీసస్ క్రిస్ట్ యునైటెడ్ ప్రేయర్ హౌస్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అయిన ఎల్.ప్రశాంత్‌కుమార్ బైబిల్ థియోలాజిలో పీహెచ్డీ పూర్తి చేసిన సందర్భంగా డాక్టరేట్ పట్టా అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెవరెండ్ సి.రాజ్‌కుమార్ గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రశాంత్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రశాంత్‌కుమార్ పూర్తిచేసిన క్రీస్ట్ ఇన్ ది ఓల్డ్ టెస్టమెంట్ అనే పరిశోధన అంశం ద్వారా గతంలో ఎన్నడూ వినని సంగతులు ఈ పరిశోధనలో వినడం జరిగిందని అన్నారు. ప్రశాంత్‌కుమార్ లాంటి యవ్వన దేవుని సేవకులు క్రీస్తు పరిచర్యకు అవసరం అని తెలిపారు. డాక్టరేట్ అవార్డు గ్రహీత ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ దేవుని జ్ఞానం ద్వారా అనేకులను క్రీస్తు మార్గంలో నడిపించడంతో పాటు విశ్వాసులను సత్యవాక్యంలో స్థిరపరచడం తన జీవిత ఆశయం అన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులకు, పార్కులో యోగా చేసుకునేందుకు అనువుగా ఉండేలా సిసి ప్యాచ్ వర్క్ పనులకు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ డివిజన్‌లో చేపట్టే ఎలాంటి అభివృద్ధి పనుల్లో అయినా నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఎఇ శిరీష, కాలనీవాసులు చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ, సురేందర్, జైపాల్‌రెడ్డి,గురుదత్త,శ్రీమన్నారాయణ, మోహన్‌రెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

## కలుషిత నీటి సమస్య తలెత్తకుండా చర్యలు : కార్పొరేటర్



కలుషిత నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో కలుషిత నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శంకేశ్వర్ బజార్‌లో నల్లాల నుండి కలుషిత నీరు వస్తుందన్న సమాచారంతో శనివారం అధికారులతో కలసి సమస్యను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కరణ్‌బాగ్‌లోని హరినీమ్ అపార్ట్‌మెంటు వద్ద ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్థంబాన్ని సరిచేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌సిహెచ్ చిన్న కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న కమ్యూనిటి హాల్‌లో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్యలపై వినతిపత్రం అందజేత



**మల్కాజిగిరి ఆగస్టు23,ప్రభాతావార్త :** మోలాలిలోని ప్రధాన రహదారులన్నీ గుంతల మయం అయ్యాయని ఇంజనీరింగ్ అధికారి ఈఈ లక్ష్మణ్ కి మోలాలి రోడ్ల గురించి వివరిస్తూ మెమొరాండం మోలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ సమర్పించారు.మారుమూల గ్రామంలో కూడా ఇటువంటి రోడ్లు ఉండవని, ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఘోరంగా తయారయ్యాయని, మల్కాజ్గిరి సర్కిల్లో మోలాలి ప్రధాన రహదారులు ఉన్నంత అధ్వానంగా ఏ డివిజన్లో లేవని లక్ష్మణ్ కి వివరించారు. మల్కాజ్గిరి సర్కిల్లో మిగతా అన్ని డివిజన్లో ప్రధాన రహదారులకు డివైడర్లు , ఫుట్ పాత్ లేకాక బ్యూటిఫికేషన్ కూడా ఉంది కానీ ప్రధాన రహదారుల కనీస సౌకర్యం కూడా మోలాలి ప్రజలకు దక్కడం లేదని కార్పొరేటర్ వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ప్రధాన రహదారుల మరమ్మతులు చేయాలని కోరారు.

## తుర్కయంజాల్‌లో హైడ్రా కూల్చివేతలు

### పార్కు, ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చర్యలు

### హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్



**తుర్కయంజాల్ ఆగస్టు 23, ప్రభాతవార్త** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 21వ వార్డ్ శ్రీ సూర్య సాయి నగర్ కాలనీలో సర్వేనెంబర్ 201లోని 482 గజాల పార్కు స్థలంలోని ఆక్రమణలను హైడ్రా ఇన్స్పెక్టర్ తిరుమలేశ్ సిబ్బందితో కలిసి కూల్చి వేతలు చేపట్టారు. 201 సర్వే నెంబర్ లో 283, 284 ప్లాట్లు తుర్కయంజాల్ మున్సిపాలిటీ పై 2018 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ అయిందని హైడ్రా అధికారులు తెలిపారు. అనంతరం 482 గజాల పార్కు స్థలం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కి సంబంధించిందని మున్సిపల్ అధికారులు బోర్డు ను పాతారు. పార్కు స్థలాన్ని కాపాడినందుకు శ్రీ సూర్య సాయి నగర్ కాలనీవాసులు హైడ్రా అధికారులకు, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల సీఐ రవికుమార్, ఎస్ఐ నోయల్ రాజ్, హైడ్రా సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## రూ.18లక్షలతో సిసి రోడ్డు పనులు : బన్నాల గీత



ప్రశాంతినగర్‌లో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ ప్రశాంతినగర్ కాలనీలో రూ.18లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అమె మాట్లాడుతూ సిసి రోడ్డు నిర్మాణ సమయంలో జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షణ ఉండాలని, కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని, కాలనీలో ఉండే ప్రజలకు నిర్మాణ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలని కోరారు. నాణ్యత ప్రమాణాలలో ఎటువంటి జాప్యం జరిగిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రాధిక, వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కొక్కండ జగన్, చేర్యాల శ్రీనివాస్, మాస శేఖర్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బీరప్ప గడ్డ బాలు, బంటి గౌడ్, ప్రశాంత్ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ మోహన్, జిఎస్ స్వామి, ముత్యం రెడ్డి సుబ్బా రెడ్డి, శాస్త్రి, లక్ష్మి భూమేష్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఉప్పల్ భాగ్యనగర్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా ప్రకాష్‌గౌడ్



భాగ్యనగర్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన ఎల్లగోని ప్రకాష్‌గౌడ్‌ను సత్కరిస్తున్న ఉత్సవ సమితి నేతలు

**ఉప్పల్, ఆగస్టు 22 ప్రభాతవార్త :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ ప్రస్తుత కన్వీనర్ అరటికాయల వంశీకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత ఎల్లగొని ప్రకాష్ గౌడ్‌ను ఉప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉత్సవ సమితి మల్కాజిగిరి పార్లమెంట్ కో కన్వీనర్ రేవెల్లి రాజు, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ చల్ల ప్రభాకర్‌లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎల్లగోని ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. మండపాల నిర్వహకులకు తగు చేయూత అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి పెద్దలు గొరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్ ముదిరాజ్, రావుల బాలకృష్ణ గౌడ్, బొంగు రమేష్ గౌడ్, యు బి చారి, ఉత్సవ సమితి ప్రతినిధులు,మార్నెని ఫణిందర్, రెడ్డి గారి దేవేందర్ రెడ్డి, బోరంపేట మురళి కృష్ణ, గొరిగే వెంకటేష్, వర్కల రాజేందర్ గౌడ్, తీగ విట్టల్ రావు, దువ్వాల రమేష్, నామ శ్రావణ్, ఆకుల రాకేష్, ఈదులకంటి నవీన్ గౌడ్, ఆకుల రిషికేష్, గుండె పునేందర్, తలారి విజయ్, దాడి సునీల్, సప్పిడి సందీప్ తదితరులు పాల్గొన్నారు

## బాలాపూర్ గణేష్ పూజకు రావాలని స్పీకర్, టిపిసిసి అధ్యక్షునికి ఆహ్వానం



స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసిన పారిజాత, బాలాపూర్ నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ప్రఖ్యాత బాలాపూర్ గ్రామ గణేష్ నవరాత్రి ఉత్సవాలకు రావాలంటూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను గ్రామానికి చెందిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఆమె స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వారి వద్దకు వెళ్ళి నవరాత్రి ఉత్సవాలకు హాజరై గణేషునికి పూజలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు టేకుల సుధాకర్‌రెడ్డి, తూళ్ళ నరహరిగౌడ్, బాలాపూర్ మహాదేవర శివాలయం డైరెక్టర్ ఇక్కె శ్రీనివాస్‌లతో పాటు టేకుల దయాకర్‌రెడ్డి, వంగేటి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలి




సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఏసిపి చక్రపాణి

**మల్కాజిగిరి ఆగస్టు23,ప్రభాతావార్త :** గణేష్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని, గణేష్ మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని మల్కాజిగిరి ఏసిపి చక్రపాణి కోరారు. శనివారం మల్కాజిగిరి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో ఏసిపి చక్రపాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి చక్రపాణి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు హిందువులకు అతి పవిత్రమైనవి మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని శాంతియుతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. గణేష్ మండపాల నిర్వాహకులు యువకులు పోలీస్ అధికారులు చూపించిన ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని జాగ్రత్తలు అనుమతులు తీసుకొని గణేష్ ఉత్సవాల నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో మల్కాజ్గిరి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్ పలు అధికారులు భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.



బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న మాజీ పార్లమెంటు సభ్యులు మధుయాష్కీ గౌడ్